12 YEARS PEN POWER JOURNEY 2014 - 2026 ప్రశ్నించడం మన హక్కు

విశాఖపట్నం | హైదరాబాద్ | ఉభయ గోదావరి | ఎన్. టి. ఆర్ | గుంటూరు | ప్రకాశం | నెల్లూరు | తిరుపతి | చిత్తూరు | కడప

# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 2 సంచిక : 25 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : ఒంగోలు బుధవారం 30 సెప్టెంబర్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME :2 ISSUE :25 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : ONGOLE WED 30 SEPTEMBER 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Ongole,Visakhapatnam,Kakinada,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur




## చంద్రబాబు విజన్, మోదీ సహకారంతో గ్రామీణ ప్రగతి పరుగులు పెడుతోంది

- 'పల్లె పండుగ 3.0' కార్యక్రమం ప్రారంభం
- రూ.1.30 లక్షల కోట్లతో గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపడతామన్న పవన్
- గత ప్రభుత్వంతో పోలిస్తే పది రెట్ల వేగంతో అభివృద్ధి చేస్తున్నామని వెల్లడి
- రూ.11,085 కోట్లతో సీసీ, బీటీ రోడ్లు, మినీ గోకులాలు, పండ్ల తోటల నిర్మాణం
- అభివృద్ధి పనుల నాణ్యతను ప్రజలే పర్యవేక్షించాలని పిలుపు

- మిగతా 2లో



## వైసీపీ నేత కాకుమాను కుటుంబానికి జగన్ పరామర్శ

- ఇటీవల కన్నుమూసిన వైసీపీ ప్రచార విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కాకుమాను రాజశేఖర్
- ఒంగోలులో కాకుమాను నివాసానికి వెళ్లిన జగన్
- కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని భరోసా

- మిగతా 2లో

## నైపుణ్యాలే అభివృద్ధికి చోదకశక్తి

- విజయవాడలో మిషన్ కర్మయోగి దక్షిణాది రాష్ట్రాల సదస్సు
- ఉద్యోగుల సామర్థ్యాల పెంపులో ఏపీకి దేశంలోనే ప్రథమ స్థానం
- పాలనలో టెక్నాలజీ వాడకం పెరగాలని సీఎం చంద్రబాబు పిలుపు
- నేర్చుకున్న నైపుణ్యాలు సేవల నాణ్యతలో కనిపించాలని స్పష్టీకరణ

- మిగతా 2లో






# పల్లె పండుగ 3.0 ప్రారంభం..
# గ్రామాలకు రూ.11,085 కోట్లు

- ఉదయగిరిలో 'పల్లె పండుగ-3' కార్యక్రమాన్ని ప్రారంభించిన సీఎం చంద్రబాబు
- రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ రోడ్ల అభివృద్ధికి రూ.1,185 కోట్లు కేటాయించినట్లు ప్రకటన
- గత ప్రభుత్వ ఐదేళ్ల పాలనతో తమ రెండేళ్ల పాలనను పోల్చిన ముఖ్యమంత్రి
- వెలిగొండ ఫేజ్-2 పూర్తితో పాటు ఉదయగిరి ప్రాంతానికి పలు ప్రాజెక్టులు మంజూరు
- సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనే ఎన్డీయే ప్రభుత్వ మంత్రమని స్పష్టీకరణ



**పెన్ పవర్ డెస్క్:**రాష్ట్రంలోని పల్లెల్లో నవోదయానికి నాంది పలుకుతూ ఎన్డీయే ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా 'పల్లె పండుగ-3' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. నెల్లూరు జిల్లా ఉదయగిరి నియోజకవర్గం రామాపురంలో జరిగిన సభలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పన కోసం రూ.11,085 కోట్లతో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్నట్లు సీఎం చంద్రబాబు ప్రకటించారు. డబుల్ ఇంజన్ సర్కార్ జెట్ స్పీడ్‌తో రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తోందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. "2024 ఎన్నికల్లో ప్రజలు మాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకున్నాం. మీరు వేసిన ఒక్క ఓటు కూడా వృథా కాలేదు. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనతో రాష్ట్రాన్ని తిరిగి గాడిలో పెట్టాం. నా అనుభవం, పవన్ కల్యాణ్ గారి ఉత్సాహం, కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రాన్ని పునర్నిర్మిస్తున్నాం" అని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో గ్రామాలు విధ్వంసానికి గురయ్యాయని, రోడ్లు గుంతలమయమై, వీధి దీపాలు వెలగని దుస్థితి ఉండేదని ఆయన విమర్శించారు.

**గ్రామీణ రోడ్ల నిర్మాణంలో రికార్డు**

'పల్లె పండుగ-3'లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 15,500 కిలోమీటర్ల బీటీ, సీసీ రోడ్ల నిర్మాణం చేపడుతున్నామని సీఎం వివరించారు. మరో రూ.2,700 కోట్లతో 6,000 కిలోమీటర్ల మేర సీసీ రోడ్లు నిర్మిస్తామని, ప్రతి ఇంటి ముందూ బురద లేని రోడ్లు ఉండేలా చూస్తామని హామీ ఇచ్చారు. గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో కేవలం 880 కిలోమీటర్ల రోడ్లు వేస్తే, తమ ఎన్డీయే ప్రభుత్వం కేవలం రెండేళ్లలోనే 6,500 కిలోమీటర్ల రోడ్లు వేసి చరిత్ర సృష్టించిందని పోల్చి చెప్పారు. "అప్పుడు ఖర్చుపెట్టిన డబ్బులు దొంగల జేబుల్లోకి పోయాయి, ఇప్పుడు మేము ఖర్చుపెట్టే ప్రతి పైసా మీ ఊరిలో అభివృద్ధి రూపంలో కనిపిస్తోంది,"

- మిగతా 2లో

## ఉగ్రవాదంపై రెడ్ లైన్ గీశాం

**అమెరికాకు జైశంకర్ గట్టి సంకేతం**



- ఉగ్రవాదంపై భాగస్వాముల వైఖరి సంబంధాలను ప్రభావితం చేస్తుందన్న జైశంకర్
- తమ ప్రధాన ఆందోళనను అర్థం చేసుకోకపోతే ఇబ్బందులు తప్పవని స్పష్టీకరణ
- దశాబ్దాలుగా పొరుగు దేశం నుంచి ఉగ్రవాదాన్ని ఎదుర్కొంటున్నామని వెల్లడి
- భారత్-అమెరికా బంధానికి వాణిజ్య విభేదాలతో పాటు ఉగ్రవాదం కూడా సవాల్ అని వ్యాఖ్య

- మిగతా 2లో



## ఇండియా కూటమికి డీఎంకే గుడ్ బై

**పెన్ పవర్ డెస్క్:** ప్రతిపక్ష ఇండియా కూటమికి డీఎంకే గుడ్ బై చెప్పింది. ఇకపై ఇండియా కూటమిలో తాము భాగం కాదని తెలిపింది. కాంగ్రెస్?తో విభేదాల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు స్పష్టం చేసింది. ఈ క్రమంలోనే సెప్టెంబర్ 30న కాంగ్రెస్ అధ్యక్షతన జరగనున్న ఇండియా కూటమి సమావేశానికి హాజరు కావడం లేదని ఆ పార్టీ వర్గాలు వెల్లడించాయి.

- మిగతా 2లో

## ఏపీ విద్యా సంస్కరణలకు సింగపూర్ ప్రశంసలు.. లోకేశ్‌కు షణ్ముగం కితాబు



- ఏపీ విద్యాశాఖ మంత్రి లోకేశ్‌తో సింగపూర్ హోం మంత్రి షణ్ముగం భేటీ
- రాష్ట్రంలో విద్యా సంస్కరణలను ప్రశంసించిన సింగపూర్ మంత్రి
- మాదకద్రవ్యాల నియంత్రణ, విద్యారంగంలో ఏపీకి సహకారం అందిస్తామని హామీ
- ఏపీ ఐటీఐలను సింగపూర్ ఐటీఈతో అనుసంధానించాలని నిర్ణయం
- డ్రాపౌట్లను సున్నా శాతానికి తగ్గించాలని షణ్ముగం సూచన

- మిగతా 2లో

## నలుగురు సహోద్యోగులను కాల్చి చంపిన సీఐఎస్ఎఫ్ జవాన్




- జమ్మూకశ్మీర్‌లోని కతువా జిల్లాలో సీఐఎస్ఎఫ్ క్యాంపులో దారుణం
- సహోద్యోగులపై కాల్పులు జరిపిన హెడ్ కానిస్టేబుల్ అవధేశ్ సింగ్
- అసిస్టెంట్ కమాండెంట్ సహా నలుగురు సిబ్బంది అక్కడికక్కడే మృతి
- వాగ్వాదమే కాల్పులకు కారణమని ప్రాథమిక సమాచారం
- నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు.. సీఐఎస్ఎఫ్ ఉన్నతస్థాయి విచారణ

- మిగతా 2లో

## దేవుడి పేరుతో రాజకీయాలు వద్దు

- దేవుడి పేరుతో రాజకీయాలు చేయడం సరికాదన్న పొన్నం
- ప్రతి ఒక్కరి విశ్వాసాలను గౌరవించడం మన సంస్కృతి అని వ్యాఖ్య
- ఆలయాల అభివృద్ధి ప్రభుత్వ బాధ్యత అని స్పష్టీకరణ



**పెన్ పవర్ డెస్క్:**రాజకీయ ప్రయోజనాల కోసం దేవుడి పేరును వాడుకోవడం సరికాదని, అది ఎవరికీ మేలు చేయదని తెలంగాణ రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ప్రతి వ్యక్తికి తమ తమ దేవతలపై విశ్వాసం ఉంటుందని, ఇతరుల నమ్మకాలను

- మిగతా 2లో

## రష్యాలో కుప్పకూలిన సైనిక విమానం.. ఆరుగురు మృతి



**పెన్ పవర్ డెస్క్:**మాస్కో: రష్యాలో ఘోర విమాన ప్రమాదం జరిగింది. శిక్షణ సమయంలో రష్యా సైనిక విమానం (Tu-95 బాంబర్) కుప్పకూలింది. ఈ ఘటనలో ఆరుగురు మృతి చెందగా మరొకరు గాయపడ్డారని రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది. తూర్పు అమూర్

- మిగతా 2లో

## ఎన్నికల 'మ్యాచ్ ఫిక్సింగ్'.. ప్రధాని మోదీ రాజీనామా చేయాలి

- ఎన్నికల ప్రక్రియలో 'మ్యాచ్ ఫిక్సింగ్' జరుగుతోందని కాంగ్రెస్ ఆరోపణ
- ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా రాజీనామాకు డిమాండ్
- 13.30 కోట్ల ఓట్లను తొలగించారని, వాటిని పునరుద్ధరించాలని తీర్మానం
- ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌ను వెంటనే తొలగించాలని పట్టు
- పార్లమెంటు, కోర్టులు, వీధుల్లో పోరాడతామని కాంగ్రెస్ ప్రకటన

- మిగతా 2లో






## అంతరాలు తగ్గించడమే నిజమైన అభివృద్ధి

- చివరి వ్యక్తి సంక్షేమమే అభివృద్ధికి గీటురాయి అన్న భగవత్
- అభివృద్ధిలో అంతరాలు వీలైనంత తగ్గించాలని సూచన
- ప్రకృతిని కాపాడుకుంటూనే ప్రగతి సాధించాలి
- అభివృద్ధి బాధ్యత సమాజం కూడా తీసుకోవాలని పిలుపు

- మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

# నైపుణ్యాలే అభివృద్ధికి చోదకశక్తి

దేశాభివృద్ధిలో రాబోయే రెండు దశాబ్దాలు అత్యంత కీలకమని, ప్రజల మారుతున్న ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వ పాలనా వ్యవస్థల్లో విప్లవాత్మక మార్పులు రావాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆకాంక్షించారు. నైపుణ్యాభివృద్ధి, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడం ద్వారానే ఇది సాధ్యమవుతుందని ఆయన స్పష్టం చేశారు. విజయవాడలో మంగళవారం నిర్వహించిన "మిషన్ కర్మయోగి" దక్షిణాది రాష్ట్రాల ప్రాంతీయ సదస్సును ముఖ్యమంత్రి ప్రారంభించి ప్రసంగించారు.ప్రభుత్వ ఉద్యోగుల సామర్థ్యాల పెంపులో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ మేరకు ప్రకటించిన పురస్కారాన్ని ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి పియూష్ కుమార్, ఏపీఎస్డీపీఎస్ ఈడీ వీఆర్ అలపర్తి స్వీకరించారు. ఈ విభాగంలో కర్ణాటక, ఒడిశా రాష్ట్రాలు వరుసగా రెండు, మూడు స్థానాల్లో నిలిచి అవార్డులను అందుకున్నాయి.శిక్షణ అంటే కేవలం ధ్రువపత్రాలు పొందడం మాత్రమే కాదని, నేర్చుకున్న నైపుణ్యాలు ప్రజలకు అందే సేవల నాణ్యతలో ప్రతిబింబించాలని సీఎం పేర్కొన్నారు. "ఒక రెవెన్యూ అధికారి సమస్యను వేగంగా పరిష్కరించడం, ఉపాధ్యాయుడు మెరుగ్గా బోధించడం వంటి సానుకూల మార్పులే శిక్షణకు అసలైన గీటురాయి" అని ఆయన వివరించారు. సాంకేతికత అందుబాటులోకి వచ్చినప్పటికీ, ఇంకా పాత నిబంధనలు, అనవసరమైన పేపర్‌వర్క్‌ను కొనసాగించడం సరికాదని, పాలనా ప్రక్రియలను సమూలంగా సంస్కరించాలని ఆయన అధికారులకు దిశానిర్దేశం చేశారు.

పాలనలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వంటి అత్యాధునిక సాంకేతికతలను విస్తృతంగా వినియోగించుకోవాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. ప్రభుత్వ ఉద్యోగులు సోషల్ మీడియాలో సమయాన్ని వెచ్చించే బదులు, 'ఐగాట్-మిషన్ కర్మయోగి' వేదిక ద్వారా తమ వృత్తిపరమైన నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని సూచించారు. ప్రభుత్వం కేవలం నియంత్రణ వ్యవస్థగా కాకుండా, ప్రజలను సాధికారత దిశగా నడిపించేదిగా ఉండాలని, తద్వారా 2047 నాటికి వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర లక్ష్యాల సాధించవచ్చని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సదస్సులో పలు దక్షిణాది రాష్ట్రాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఇండియా కూటమికి డీఎంకే గుడ్ బై

- మొదటి పేజి తరువాయి

డీఎంకే ప్రతినిధి టి.కె.ఎస్. ఇలంగోవన్ మాట్లాడుతూ.. ప్రతిపక్ష ఇండియా కూటమిలో ఇకపై డీఎంకే భాగం కాదని తెలిపారు. కాంగ్రెస్ తో విభేదాల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన స్పష్టం చేశారు. సెప్టెంబర్ 30న జరగనున్న ఇండియా కూటమి సమావేశానికి కూడా డీఎంకే హాజరు కాదని ఆయన తేల్చిచెప్పారు. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల అనంతరం కాంగ్రెస్ పార్టీ తమతో బంధాన్ని తెంచుకుని అధికార టీవీకే పార్టీకి మద్దతు ఇచ్చి మాకు ద్రోహం చేసిందని విమర్శించారు. కేవలం రెండు పదవుల కోసం ఆశపడి కాంగ్రెస్ డీఎంకేకు వెన్నుపోటు పొడిచిందని అన్నారు. కాంగ్రెస్ తీరుతో ఇండియా కూటమిలోని ఇతర పార్టీలు కూడా అసంతృప్తితో ఉన్నాయని.. సమావేశానికి వెళ్లేందుకు ఆ పార్టీలు కూడా విముఖత వ్యక్తం చేస్తున్నాయని చెప్పారు. అయితే, బీజేపీపై వ్యతిరేకత విషయంలో ఇండియా కూటమిలోని పార్టీలు భావజాలపరంగా ఐక్యంగానే ఉన్నాయని చెప్పారు. ఇండియా కూటమి సమావేశానికి హాజరుకానంత మాత్రాన ఎన్డీఏకు మద్దతు ఇస్తున్నట్లు కాదని పేర్కొన్నారు.

### ఇండియా కూటమి కీలక సమావేశం

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) విషయంలో ఈసీలో భేదాభిప్రాయాలు ఉన్నాయన్న వార్తలు దేశ రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపిన విషయం తెలిసిందే. భారత ఎన్నికల ప్రధాన కమిషనర్ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో సీఈసీ జ్ఞానేష్ కుమార్‌ను తొలగించాలనే డిమాండ్‌తో పాటు ఓటరు జాబితాల ప్రత్యేక సవరణ ప్రక్రియపై చర్చించేందుకు సెప్టెంబర్ 30న ఇండియా కూటమి సమావేశానికి కాంగ్రెస్ పిలుపునిచ్చింది. కాంగ్రెస్‌తో విభేదాల నేపథ్యంలో డీఎంకే ఇండియా కూటమి నుంచి వైదొలగడంతో పాటు సమావేశానికి కూడా హాజరు కావడం లేదని తెలిపింది. ఇక, ముందస్తు షెడ్యూల్ కారణంగా యూపీ మాజీ సీఎం అఖిలేష్ యాదవ్ కూడా ఇండియా కూటమి సమావేశానికి హాజరు కావడం లేదు. సమాజ్ వాదీ పార్టీ తరుపున సీనియర్ నేత ఈ సమావేశానికి హాజరు కానున్నట్లు ఆ పార్టీ వర్గాలు వెల్లడించాయి.

## దేవుడి పేరుతో రాజకీయాలు వద్దు

- మొదటి పేజి తరువాయి

గౌరవించడం భారతీయ సంస్కృతిలో భాగమని ఆయన పేర్కొన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో పలు కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారని పొన్నం ప్రభాకర్ తెలిపారు. రాష్ట్రంలోని దేవాలయాలను అభివృద్ధి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఆయన స్పష్టం చేశారు. వేములవాడ రాజన్న, భద్రాద్రి రాముడు, కొండగట్టు ఆంజనేయ స్వామి సహా అన్ని ఆలయాల పట్ల తనకు గౌరవం, విశ్వాసం ఉన్నాయని చెప్పారు. వ్యక్తిగతంగా తనకు శివుడు ఆరాధ్య దైవమని ఆయన పేర్కొన్నారు. ప్రజల విశ్వాసాలను ప్రభుత్వం గౌరవిస్తుందని, రాష్ట్రవ్యాప్తంగా ఆలయాల అభివృద్ధికి కట్టుబడి ఉందని అన్నారు.

## రష్యాలో కుప్పకూలిన సైనిక విమానం.. ఆరుగురు మృతి

- మొదటి పేజి తరువాయి

ప్రాంతంలోని క్రాస్నోయరోవో గ్రామానికి సమీపంలో మంగళవారం (సెప్టెంబర్ 29) ఈ ప్రమాదం జరిగింది.సాంకేతిక కారణాలతో టేకాఫ్ అయిన కాసేపటికే విమానం కుప్పకూలింది. ప్రమాద సమయంలో విమానంలో మొత్తం ఏడుగురు ఉన్నారు. ఇందులో ఆరుగురు మరణించగా.. ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. జనవాసాలు లేని ప్రదేశంలో విమానం కుప్పకూలడంతో పెను ప్రమాదం తప్పింది. సమాచారం అందుకున్న అధికారులు ఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడ్డ వ్యక్తిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదానికి కారణం ఏంటన్నది ఇంకా తెలియరాలేదు. ఈ ఘటనపై అధికారులు దర్యాప్తు చేప్టటారు.ఫ్లైట్ క్రాష్?కు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్?గా మారాయి. ఈ వీడియోలో.. కుప్పకూలగానే విమానం ఇంధనం ట్యాంకులు పేలిపోవడంతో భారీగా మంటలు చెలరేగడం కనిపించింది.

# పల్లె పండుగ 3.0 ప్రారంభం.. గ్రామాలకు రూ.11,085 కోట్లు

- మొదటి పేజి తరువాయి

అని చంద్రబాబు వ్యాఖ్యానించారు.

### పవన్ నాయకత్వంలో పంచాయతీరాజ్ అద్భుతం

ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో పంచాయతీరాజ్ శాఖ అద్భుతమైన మార్పులు తీసుకొచ్చిందని సీఎం ప్రశంసించారు. రెండున్నర దశాబ్దాల తర్వాత 10,000 మందికి పదోన్నతులు కల్పించడం, నిలిచిపోయిన 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.4,136 కోట్లు విడుదల చేయించడం వంటి విజయాలను ఆయన గుర్తుచేశారు. పంచాయతీరాజ్ శాఖకు 13 జాతీయ అవార్డులు రావడం పవన్ పనితీరుకు నిదర్శనమని కొనియాడారు.

### ఉదయగిరికి వరాల జల్లు

ఉదయగిరి నియోజకవర్గ అభివృద్ధికి పలు కీలక ప్రాజెక్టులను ముఖ్యమంత్రి మంజూరు చేశారు.

65,000 ఎకరాలకు సాగునీరు అందించే పెద్దిరెడ్డిపల్లి రిజర్వాయర్ కాలువ పనులకు రూ.52.52 కోట్లు.

90,000 ఎకరాలకు సాగునీరు, 2.35 లక్షల మందికి తాగునీరు అందించే సోమశిల హైలెవల్ కెనాల్ ఫేజ్-1 భూసేకరణకు రూ.85 కోట్లు.

రూ.3,876 కోట్ల పెట్టుబడితో 5,100 మందికి ఉద్యోగాలిచ్చే డిఫెన్స్ మాన్యుఫ్యాక్చరింగ్ హబ్‌గా ఉదయగిరిని తీర్చిదిద్దేందుకు అవసరమైన క్లియరెన్సులు.

కనిగిరిలోని 189 ఫ్లోరైడ్ గ్రామాల సమస్య పరిష్కారానికి రూ.100 కోట్లు.

వెలిగొండ ప్రాజెక్టు ఫేజ్-2ను పూర్తి చేసి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తామని హామీ ఇచ్చారు.

### సంక్షేమం, అభివృద్ధి మా మంత్రం

ఎన్నికల్లో ఇచ్చిన 'సూపర్ సిక్స్' హామీలను నిలబెట్టుకున్నామని చంద్రబాబు తెలిపారు. తల్లికి వందనం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత గ్యాస్ సిలిండర్లు, రూ.4,000 పెన్షన్ వంటి పథకాలతో ప్రజలకు అండగా నిలుస్తున్నామన్నారు. రూ.10 లక్షల కోట్ల అప్పులతో వెంటిలేటర్‌పై ఉన్న రాష్ట్రాన్ని కేంద్ర ప్రభుత్వ సహకారంతో బయటకు తీసుకొచ్చామని పేర్కొన్నారు. రాష్ట్రానికి రూ.22 లక్షల కోట్ల పెట్టుబడులు ఆకర్షించామని, దీని ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని చెప్పారు. అభివృద్ధికి ఎవరైనా అడ్డువస్తే ఉపేక్షించేది లేదని, సుస్థిర ప్రభుత్వంతోనే నిరంతర అభివృద్ధి సాధ్యమని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## ఏపీ విద్యా సంస్కరణలకు సింగపూర్ ప్రశంసలు.. లోకేశ్‌కు షణ్ముగం కితాబు

ఆంధ్రప్రదేశ్ విద్యావ్యవస్థలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న వినూత్న సంస్కరణలను సింగపూర్ ప్రభుత్వం ప్రశంసించింది. రాష్ట్ర విద్యావ్యవస్థ బలోపేతానికి తమ వంతు పూర్తి సహకారం అందిస్తామని సింగపూర్ హోం, న్యాయశాఖల మంత్రి కె. షణ్ముగం హామీ ఇచ్చారు. మంగళవారం తిరుమలలో ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌తో ఆయన భేటీ అయ్యారు.శ్రీవారి దర్శనం అనంతరం ఇరువురు నేతలు రాష్ట్ర అభివృద్ధి, విద్యా సంస్కరణలు, మాదకద్రవ్యాల నివారణ వంటి కీలక అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. రాష్ట్రంలో ప్రభుత్వం చేపడుతున్న వివిధ కార్యక్రమాలను, ముఖ్యంగా విద్యారంగంలో తీసుకువస్తున్న విప్లవాత్మక మార్పులను మంత్రి లోకేశ్ వివరించారు. ప్రభుత్వ పనితీరుతో పాటు విద్యకు ఇస్తున్న ప్రాధాన్యతను మంత్రి షణ్ముగం ఈ సందర్భంగా అభినందించారు.

పాఠశాలల్లో డ్రాపౌట్ రేటును సున్నా శాతానికి తగ్గించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి షణ్ముగం సూచించారు. బడి మానేసే పిల్లలే భవిష్యత్తులో మాదకద్రవ్యాల బారిన పడే ప్రమాదం ఉందని ఆయన పేర్కొన్నారు. మాదకద్రవ్యాల నిర్మూలనకు సింగపూర్ తరహా కఠిన చట్టాలు అవసరమని అభిప్రాయపడుతూ, డ్రగ్స్ రహిత ఏపీ నిర్మాణానికి తమ సహకారం అందిస్తామని తెలిపారు.ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తున్న తీరును మంత్రి లోకేశ్ వివరించగా, ఏపీలోని ప్రభుత్వ పాఠశాలలను స్వయంగా సందర్శించేందుకు మంత్రి షణ్ముగం ఆసక్తి వ్యక్తం చేశారు. అలాగే, యువతకు ఉపాధి ఆధారిత నైపుణ్య శిక్షణ అందించే లక్ష్యంతో ఏపీలోని ఐటీఐలను సింగపూర్‌కు చెందిన 'ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్' (ఐటీఈ)తో అనుసంధానించేందుకు పరస్పరం సహకరించుకోవాలని ఇరువురు నేతలు నిర్ణయించారు.

## చంద్రబాబు విజన్, మోదీ సహకారంతో గ్రామీణ ప్రగతి పరుగులు పెడుతోంది

రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల స్వరూపాన్ని మార్చే లక్ష్యంతో చేపట్టిన 'పల్లె పండుగ 3.0' కార్యక్రమం నెల్లూరు జిల్లా ఉదయగిరి నియోజకవర్గంలో మంగళవారం లాంఛనంగా ప్రారంభమైంది. రామాపురంలో జరిగిన ఈ భారీ బహిరంగ సభకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. గ్రామీణాభివృద్ధికి కూటమి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతను, భవిష్యత్ ప్రణాళికలను ఆవిష్కరించారు. రాబోయే సంవత్సరాల్లో పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా విభాగాల ద్వారా రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా రూ.1.30 లక్షల కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టబోతున్నామని ప్రకటించారు.

### గత ప్రభుత్వంతో పోలిస్తే పది రెట్ల అభివృద్ధి

ఈ సందర్భంగా గత వైసీపీ ప్రభుత్వ పాలనతో ప్రస్తుత కూటమి ప్రభుత్వ పనితీరును పవన్ కల్యాణ్ పోల్చిచూపారు. "వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో 880 కిలోమీటర్ల సీసీ రోడ్లు నిర్మిస్తే, మేము కేవలం రెండేళ్లలోనే దానికి పది రెట్లు ఎక్కువగా దాదాపు 9,000 కిలోమీటర్లకు పైగా పూర్తి చేశాం. వారు 304 మినీ గోకులాలు నిర్మిస్తే, మేము 30,000కు పైగా నిర్మించాం. 304 ఎక్కడ, 30,000 ఎక్కడో ప్రజలు ఆలోచించాలి" అని అన్నారు. సీఎం చంద్రబాబు దార్శనికత, ప్రధాని నరేంద్ర మోదీ సహకారంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో గ్రామీణ ప్రగతిని పరుగులు పెట్టిస్తున్నామని తెలిపారు.

### రూ.11,085 కోట్లతో 'పల్లె పండుగ 3.0'

'పల్లె పండుగ 3.0' కార్యక్రమాన్ని రూ.11,085 కోట్ల బడ్జెట్‌తో ప్రారంభిస్తున్నట్లు పవన్ కల్యాణ్ ప్రకటించారు. ఇందులో కేంద్రం వాటా రూ.5,400 కోట్లు కాగా, రాష్ట్ర ప్రభుత్వం రూ.5,700 కోట్లు భరిస్తోందని వివరించారు. ఈ నిధులతో 6,000 కిలోమీటర్ల సీసీ రోడ్లు, 9,500 కిలోమీటర్ల బీటీ రోడ్లు, 22,500 మినీ గోకులాలు, 50 వేల ఎకరాల్లో పండ్ల తోటలు, వెయ్యి కిలోమీటర్ల డ్రైన్లు, గ్రామ పంచాయతీ భవనాలు, బస్ షెల్టర్లు, రచ్చబండలు వంటి అనేక పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. చారిత్రక ప్రాధాన్యత, వలసల సమస్య కారణంగానే ఉదయగిరిని ఈ కార్యక్రమానికి వేదికగా ఎంచుకున్నామని స్పష్టం చేశారు.

### ఉదయగిరి అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు

ఉదయగిరి నియోజకవర్గానికి మహర్దశ పట్టబోతోందని పవన్ కల్యాణ్ అన్నారు. ఫ్లోరైడ్ సమస్య పరిష్కారానికి గతంలో నిలిచిపోయిన సుజలా స్రవంతి పథకాన్ని రూ.52 కోట్లతో పునరుద్ధరించి 381 పనులు చేపట్టనున్నట్లు హామీ ఇచ్చారు. ఉదయగిరి కోటకు వెళ్లేందుకు రూ.2.5 కోట్లతో రహదారి మంజూరు చేస్తున్నామని, అటవీ అనుమతులు త్వరగా పొందేలా అధికారులను ఆదేశిస్తున్నామని తెలిపారు. ఉదయగిరి కోటను హెరిటేజ్, ఎకో టూరిజం కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు డీపీఆర్ సిద్ధం చేసి, కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా నిధులు సమీకరిస్తామని వెల్లడించారు.

### అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం ముఖ్యం

అభివృద్ధి పనుల్లో నాణ్యత, పారదర్శకతకు పెద్దపీట వేస్తున్నామని, ఇందులో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు. "మీ గ్రామంలో జరుగుతున్న పనులను ప్రజలు తమవిగా భావించి పర్యవేక్షించాలి. కాంట్రాక్టర్లు నాణ్యతగా పనిచేస్తున్నారా లేదా అని గమనించాలి. లోపాలు కనిపిస్తే అధికారుల దృష్టికి తీసుకెళ్లాలి. అవసరమైతే సోషల్ ఆడిట్ నిర్వహిస్తాం. వెచ్చించే ప్రతి రూపాయి సద్వినియోగం కావాలి" అని కోరారు.

రైతుల కోసం డొంక రోడ్ల నిర్మాణానికి పైలట్ ప్రాజెక్ట్ ప్రారంభిస్తున్నామని, గిరిజన ఆవాసాలకు రహదారి సౌకర్యం కల్పించడానికి ప్రాధాన్యత ఇస్తున్నామని పవన్ కల్యాణ్ వివరించారు. ఈ కార్యక్రమానికి అపూర్వ స్వాగతం పలికిన ప్రజలకు, విజయవంతం చేసిన అధికారులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

## నలుగురు సహోద్యోగులను కాల్చి చంపిన సీఐఎస్ఎఫ్ జవాన్

జమ్మూకశ్మీర్‌లో తీవ్ర విషాదకరమైన సంఘటన చోటుచేసుకుంది. సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సీఐఎస్ఎఫ్)కు చెందిన ఒక జవాన్ తన సహోద్యోగులపై విచక్షణారహితంగా కాల్పులు జరపడంతో నలుగురు సిబ్బంది ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో ఒక ఉన్నతాధికారి కూడా ఉన్నారు. కతువా జిల్లాలోని సేవా-2 జలవిద్యుత్ ప్రాజెక్టు వద్ద ఈ దారుణం జరిగింది.వివరాల్లోకి వెళితే.. కతువా జిల్లాలోని బసోహ్లి ప్రాంతంలో ఉన్న సేవా-2 హైడల్ పవర్ ప్రాజెక్టుకు సీఐఎస్ఎఫ్ సిబ్బంది భద్రత కల్పిస్తున్నారు. మంగళవారం సాయంత్రం 7 గంటల సమయంలో డ్యూటీ మార్పు జరుగుతుండగా, హెడ్ కానిస్టేబుల్ అవధేశ్ సింగ్ అనే జవాన్‌కు, ఇతర సిబ్బందికి మధ్య వాగ్వాదం జరిగింది. ఈ వాగ్వాదం తీవ్రస్థాయికి చేరడంతో ఆగ్రహంతో ఊగిపోయిన అవధేశ్ సింగ్, తన వద్ద ఉన్న తుపాకీతో సహోద్యోగులపై కాల్పులకు తెగబడ్డాడు.ఈ కాల్పుల్లో అసిస్టెంట్ కమాండెంట్ అంకిత్ కుమార్ పాండే, సబ్-ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్ సింగ్, కానిస్టేబుళ్లు రఫిక్ అహ్మద్, సందీప్ కుమార్ తీవ్రంగా గాయపడ్డారు. వారిని హుటాహుటిన సమీపంలోని ఆసుపత్రికి తరలించినప్పటికీ, అప్పటికే వారు మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు.సంఘటన జరిగిన వెంటనే అప్రమత్తమైన ఇతర సిబ్బంది, నిందితుడు అవధేశ్ సింగ్‌ను అదుపులోకి తీసుకుని, కతువా పోలీసులకు అప్పగించారు. కతువా ఎస్ఎస్‌పి మోహితా శర్మ ఈ ఘటనను ధృవీకరించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మరోవైపు, సీఐఎస్ఎఫ్ ప్రధాన కార్యాలయం ఈ ఘటనపై తీవ్రంగా స్పందించింది. వాస్తవాలను నిగ్గుతేల్చేందుకు ఉన్నతస్థాయి విచారణకు (కోర్ట్ ఆఫ్ ఎంక్వైరీ) ఆదేశించింది. సీఐఎస్ఎఫ్ డీజీ స్వయంగా పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. కేవలం చిన్న వాగ్వాదమే ఈ దారుణానికి కారణమా లేక మరేదైనా నేపథ్యం ఉందా అనే కోణంలో అధికారులు విచారణ జరుపుతున్నారు. ఒకే దళానికి చెందిన సిబ్బంది మధ్య జరిగిన ఈ కాల్పుల ఘటన (ఫ్రాట్రిసైడ్) తీవ్ర కలకలం రేపింది.

## వైసీపీ నేత కాకుమాను కుటుంబానికి జగన్ పరామర్శ

వైసీపీ అధినేత జగన్ ఈరోజు ఒంగోలులో పర్యటించారు. ఇటీవల మరణించిన పార్టీ ప్రచార విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కాకుమాను రాజశేఖర్ కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. ఒంగోలులోని రాజశేఖర్ నివాసానికి వెళ్లిన జగన్, ఆయన కుటుంబ సభ్యులను కలిసి సానుభూతిని తెలియజేశారు. పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని వారికి భరోసా ఇచ్చారు.

కాగా, విజయవాడలో సెప్టెంబర్ 21న డీఎస్సీ నియామకాల్లో అక్రమాలు జరిగాయంటూ వైసీపీ చేపట్టిన నిరసనలో జరిగిన తోపులాట అనంతరం రాజశేఖర్ అస్వస్థతకు గురై చికిత్స పొందుతూ మరణించిన విషయం తెలిసిందే. రాజశేఖర్ గతంలో లిడ్?క్యాప్ ఛైర్మన్‌గా కూడా పనిచేశారు.

## అంతరాలు తగ్గించడమే నిజమైన అభివృద్ధి

అభివృద్ధి ఫలాలు సమాజంలోని అట్టడుగున ఉన్న చివరి వ్యక్తికి అందాలని, వారి ముఖంలో చిరునవ్వు కనిపించినప్పుడే దేశం సుభిక్షంగా ఉంటుందని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) సర్ సంఘచాలక్ మోహన్ భగవత్ పేర్కొన్నారు. మహారాష్ట్రలోని యవత్మాల్‌లో పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ జయంతి వేడుకల సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు.అభివృద్ధి అంటే అందరినీ ఒకే స్థాయికి తీసుకురావడం కాదని, సమాజంలోని హెచ్చుతగ్గులను, వివిధ వర్గాల మధ్య ఉన్న అంతరాన్ని వీలైనంతగా తగ్గించడమేనని ఆయన స్పష్టం చేశారు. 'కొంతమందికే గరిష్ఠ ప్రయోజనం' చేకూరాలన్న వాదనను తాను వ్యతిరేకిస్తున్నానని, దీనదయాళ్ ఉపాధ్యాయ ఆశించినట్లుగా 'అందరికీ మేలు' జరగాలని భగవత్ ఆకాంక్షించారు. ఏ నిర్ణయం తీసుకున్నా సమాజంలోని అత్యంత నిరుపేద వ్యక్తి సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకోవాలన్న మహాత్మా గాంధీ సూత్రాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు.ప్రతి వ్యక్తికి కూడు, గుడ్డ, నీడ వంటి ప్రాథమిక అవసరాలతో పాటు నాణ్యమైన విద్య, వైద్యం అందించి, వారు గౌరవప్రదంగా జీవించేలా చూడటమే నిజమైన అభివృద్ధి అని ఆయన వివరించారు. రైతులు రుణాల ఊబిలో కూరుకుపోకుండా సేంద్రియ, మిశ్రమ వ్యవసాయ పద్ధతులు అవలంబించాలని, విత్తనాలు, ఎరువుల విషయంలో స్వయం సమృద్ధి సాధించాలని సూచించారు. ప్రగతి పేరిట ప్రకృతిని విధ్వంసం చేయకూడదని హితవు పలికారు. అభివృద్ధి బాధ్యత కేవలం ప్రభుత్వానిదే కాదని, సమాజం కూడా తన వంతు పాత్ర పోషించాలని మోహన్ భగవత్ పిలుపునిచ్చారు.

## ఎన్నికల 'మ్యాచ్ ఫిక్సింగ్'.. ప్రధాని మోదీ రాజీనామా చేయాలి

ఎన్నికల ప్రక్రియలో భారీగా అక్రమాలు చోటుచేసుకుంటున్నాయని ఆరోపిస్తూ కాంగ్రెస్ పార్టీ, కేంద్ర ప్రభుత్వంపై, ఎన్నికల సంఘంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా నైతిక బాధ్యత వహిస్తూ తక్షణమే తమ పదవులకు రాజీనామా చేయాలని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) డిమాండ్ చేసింది. మంగళవారం ఢిల్లీలో పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అధ్యక్షతన జరిగిన సీడబ్ల్యూసీ సమావేశంలో ఈ మేరకు కీలక తీర్మానాన్ని ఆమోదించారు.

దేశంలో ప్రస్తుతం కొనసాగుతున్న ఎన్నికల ప్రక్రియను ప్రధాని, ఎన్నికల సంఘం మధ్య జరుగుతున్న 'మ్యాచ్ ఫిక్సింగ్'గా కాంగ్రెస్ అభివర్ణించింది. ప్రధాని, హోంమంత్రి తరఫున ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ 'ఓట్ల దొంగతనానికి' పాల్పడుతున్నారని తీవ్ర ఆరోపణలు గుప్పించింది. సీఈసీని తక్షణమే పదవి నుంచి తొలగించాలని, ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియను నిలిపివేయాలని తీర్మానంలో పేర్కొంది. జాబితా నుంచి అన్యాయంగా తొలగించిన 13.30 కోట్ల ఓట్లను వెంటనే పునరుద్ధరించాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది.ఈ సమావేశంలో దాదాపు 25 నిమిషాల పాటు ప్రసంగించిన రాహుల్ గాంధీ, కాంగ్రెస్ కేవలం ప్రతిపక్షం మాత్రమే కాదని, అది ఒక 'ప్రతిఘటన' పార్టీ అని స్పష్టం చేశారు. ఓటు హక్కు పునరుద్ధరణ కోసం తాము చేసే పోరాటం స్వాతంత్ర్య సంగ్రామంతో సమానమని తీర్మానంలో ఉద్ఘాటించారు. ఎన్నికల సంఘం తన స్వతంత్ర ప్రతిపత్తిని తిరిగి పొందే వరకు పార్లమెంటు, న్యాయస్థానాలు, వీధుల్లో తమ పోరాటాన్ని కొనసాగిస్తామని కాంగ్రెస్ నేతలు ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

## ఉగ్రవాదంపై రెడ్ లైన్ గీశాం

భారత్-అమెరికా సంబంధాల నేపథ్యంలో కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఉగ్రవాదంపై భారత్ ఆందోళనలను భాగస్వామ్య దేశాలు గుర్తించకపోతే, అది ద్వైపాక్షిక సంబంధాలపై ప్రతికూల ప్రభావం చూపుతుందని ఆయన స్పష్టం చేశారు. ఉగ్రవాదం విషయంలో భారత్ ఒక 'రెడ్ లైన్' గీసుకుందని, ఈ విషయంలో ఎటువంటి రాజీ ఉండబోదని ఆయన పరోక్షంగా హెచ్చరించారు.ఐక్యరాజ్యసమితి సర్వప్రతినిధి సభ ఉన్నత స్థాయి సమావేశాల అనంతరం న్యూయార్క్‌లో 'ఏషియా సొసైటీ' నిర్వహించిన కార్యక్రమంలో జైశంకర్ ప్రసంగించారు. దశాబ్దాలుగా ఒక పొరుగు దేశం ఉగ్రవాదాన్ని ప్రభుత్వ విధానంగా మార్చుకుని భారత్‌ను లక్ష్యంగా చేసుకుంటోందని, పాకిస్థాన్ పేరును నేరుగా ప్రస్తావించకుండానే ఆయన దుయ్యబట్టారు. "అత్యంత కీలకమైన ఉగ్రవాద సమస్యపై మా భాగస్వామ్య దేశాల నుంచి సరైన అవగాహన, సానుభూతి లభించకపోతే, అది కచ్చితంగా ఇబ్బందులకు దారితీస్తుంది. మా ప్రాథమిక ఆందోళనలను విస్మరిస్తే, సంబంధాలపై ఆ ప్రభావం స్పష్టంగా కనిపిస్తుంది" అని ఆయన పేర్కొన్నారు.భారత్-అమెరికా సంబంధాలను ప్రభావితం చేసే అంశాల్లో వాణిజ్య, టారిఫ్ వివాదాలతో పాటు ఉగ్రవాదం కూడా ప్రధానమైనదని జైశంకర్ వివరించారు. ప్రస్తుత అమెరికా ప్రభుత్వం పాకిస్థాన్ పట్ల సానుకూల ధోరణితో వ్యవహరిస్తున్న తరుణంలో జైశంకర్ చేసిన ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

భారత్-అమెరికా బంధం భవిష్యత్తులో మరింత బలోపేతం అవుతుందని ఆశిస్తున్నప్పటికీ, పరిష్కరించాల్సిన సమస్యల విషయంలో వాస్తవిక దృక్పథంతో ఉండాల్సిన అవసరం ఉందని ఆయన నొక్కిచెప్పారు. జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాద కార్యకలాపాలకు పొరుగు దేశం నుంచే మద్దతు అందుతోందని నిరూపించేందుకు భారత్ పదేపదే తగిన ఆధారాలను సమర్పించిందని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు.

# ఒంగోలు వైభవం ఘనంగా చాటేలా...

## నేడు అంగరంగ వైభవంగా మున్సిపాలిటీ 150 ఏళ్ల వేడుకలు

తరలిరానున్న అతిరథ మహారథులు

వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు,

ఒంగోలు గిత్తల ప్రదర్శనతో సంబరాలు

ఉదయం 9 నుంచే ప్రారంభం... రాత్రి 10.15 గంటలకు క్రాకర్స్ షో తో ముగింపు

అల్పాహారం, భోజనాలు అన్నీ అక్కడే

ప్రజలందరూ తరలిరావాలి

కలెక్టర్ రాజా బాబు, ఎంపీ మాగుంట, ఎమ్మెల్యే జనార్దన్, తేజస్విని పిలుపు







**స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్ సెప్టెంబర్ 29**

చారిత్రక నగరమైన ఒంగోలు విశిష్టతను ఘనంగా చాటిచెప్పే సమయం సమీపించింది. నాలుగు నెలలుగా విడతలవారీగా సాగుతున్న సంబరాలు ఏకమై అంబరాన్ని అంటే గడియ ఆసన్నమైంది. ఒంగోలు మున్సిపాలిటీ శతాబ్దిన్నర వేడుకల నిర్వహణకు నగరం సర్వసన్నద్ధమయింది. సరిగ్గా 150 ఏళ్ల క్రితం పురుడు పోసుకున్న మున్సిపాలిటీ ప్రస్థానాన్ని ప్రస్తావిస్తూ, ఈ ప్రయాణంలో సాధించిన మైలురాళ్లను ఘనంగా తెలియజేస్తూ, త్యాగానికీ పౌరుషానికీ ప్రతిభకు ప్రతీకలుగా నిలిచిన వారిని స్మరించుకుంటూ, నగర కీర్తిని సగర్వంగా చాటి చెప్పిన అసమాన్యులను గౌరవించుకుంటూ, ఆద్యంతం ఆహ్లాదకరంగా, సాంస్కృతిక కనువిందుగా చరిత్రలో చిరస్థాయిలో నిలిచేలా ఒంగోలు ఉత్సవాలు బుధవారం జరుగనున్నాయి. స్థానిక మినీ స్టేడియంలో ఉదయం 9 గంటల నుంచి రాత్రి 10:15 గంటల వరకు ఈ కార్యక్రమాలు నిర్వహించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో ఏర్పాట్లు చేశారు. మంగళవారం ప్రకాశం భవనంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఒంగోలు కార్పొరేషన్ స్పెషల్ ఆఫీసర్ మరియు జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు, ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన రావు, రాష్ట్ర సాంస్కృతిక శాఖ కమిషన్ చైర్మన్ పొడపాటి తేజస్విని, మునిసిపల్ కమిషనర్ తుమ్మల వెంకటకృష్ణయ్య ఈ వేడుకలకు సంబంధించిన వివరాలను తెలియజేశారు.

**కార్యక్రమాలు ఇలా...:** 10 గంటలకు మాండొలిన్ స్వరాలు (సుభాని బృందం). 10:10 గంటలకు శాస్త్రీయ నృత్య ప్రదర్శన (ఆక్సా ఖాన్ బృందం ). 10:30 గంటలకు ఒంగోలు తొలి అడుగులు (దృశ్య, శ్రవణ ప్రదర్శన). 10:50 గంటలకు వేదిక పైకి అతిథుల స్వాగతం.

11 గంటలకు జాతీయ గేయం ఆలాపన. 11:10 గంటలకు జ్యోతి ప్రజ్వలన. 11:15 గంటలకు అతిథుల సందేశాలు. 12:15 గంటలకు పురస్కారాలు, సన్మానాలు. 12:30 గంటలకు డప్పుల ప్రత్యేక ప్రదర్శన. 12:45 గంటలకు సాంస్కృతిక ప్రదర్శనలు ( సన్నీ డాన్స్ మాస్టర్ బృందం) మధ్యాహ్నం ఒంటిగంటకు వందన సమర్పణ.

**మధ్యాహ్నం** మూడు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు మినీ స్టేడియం నుంచి ట్రంకు రోడ్డు మీదుగా అద్దంకి బస్టాండ్ వరకు ఒంగోలు గిత్తల ప్రదర్శన మరియు ఒంగోలు గిత్తల అందాల పోటీలు. సాయంత్రం 5:30 గంటలకు స్థానిక కళాకారులచే సాంస్కృతిక ప్రదర్శనలు. 6:30 గంటలకు తప్పెటగుళ్ళు ( ప్రత్యేక ప్రదర్శన ). 6:45 గంటలకు స్వాగత సుమాంజలి ( అయానా డాన్స్ బృందం ). రాత్రి 7 గంటలకు ఒంగోలు 150 ఏళ్ల ప్రస్థానం ( దృశ్య, శ్రవణ ప్రదర్శన ). 7:10 గంటలకు ఒంగోలు వైభవ నృత్యం ( 150 మంది కళాకారిణులచే నిర్వహణ). 7:30 గంటలకు వేదిక పైకి అతిథుల ఆహ్వానం. 7:35 గంటలకు జాతీయ గేయం ఆలాపన. 7:40 గంటలకు జ్యోతి ప్రజ్వలన. 7:45 గంటలకు అతిథుల సందేశాలు. 8:30 గంటలకు పురస్కారాలు, సన్మానాలు.. సావనీర్ ఆవిష్కరణ. 8:45 గంటలకు ట్రాన్ యాక్ట్ ( రాయల్ డాన్స్ కంపెనీ). 9 గంటలకు సాంస్కృతిక ప్రదర్శనలు ( సన్నీ డాన్స్ మరియు ఆక్సా ఖాన్ బృందం ). 9:15 గంటలకు నీత ( లైవ్ బ్యాండ్). 10:15 గంటలకు వందన సమర్పణ మరియు జాతీయ గీతాలాపన, క్రాకర్స్ షో నిర్వహణ.

**తరలిరానున్న అతిథులు.**

ఈ వేడుకలలో మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు, ఒడిశా గవర్నర్ కంభంపాటి హరిబాబు, అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, జిల్లా ఇంచార్జ్ మంత్రి ఆనం రామ నారాయణరెడ్డి, జిల్లాకు చెందిన మంత్రులు డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి, గొట్టిపాటి రవికుమార్, పలువురు ఇతర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, పలు కార్పొరేషన్ల చైర్మన్లు, ఇతర ప్రముఖులు పాల్గొంటారు. ప్రతిష్టాత్మకంగా అట్టహాసంగా నిర్వహించే ఈ వేడుకల్లో లక్షలాదిగా ప్రజలు పాల్గొనాలని కలెక్టర్, ఎంపీ, ఎమ్మెల్యే, తేజస్విని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఉదయం అల్పాహారంతో పాటు మధ్యాహ్నం, రాత్రి భోజనం ఏర్పాట్లను కూడా చేసినట్లు తెలిపారు.

MARKAPURAM మార్కాపురం
# పెన్ పవర్
మార్కాపురం - ప్రకాశం

# కృష్ణా జలాలను కందుకూరుకు తరలించండి

-సీఎం, డిప్యూటీ సీఎంకు ఎమ్మెల్యే ఇంటూరి విజ్ఞప్తి

-తాగు, సాగు నీటి సమస్యల శాశ్వత పరిష్కారం కోసం వినతి





**కందుకూరు పెన్ పవర్, సెప్టెంబర్ 29:**

వెలుగొండ ప్రాజెక్టు నుంచి కృష్ణా జలాలను కందుకూరు నియోజకవర్గానికి తరలిస్తే సాగు, తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం దొరుకుతుందని కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు ప్రభుత్వ పెద్దలకు విన్నవించారు. మంగళవారం ఉదయగిరి నియోజకవర్గ పర్యటనకు విచ్చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లకు ఎమ్మెల్యే నాగేశ్వరరావు రిప్రజెంటేషన్ ఇచ్చారు.

**అన్ని చెరువులు నింపేలా....:** నియోజకవర్గంలోని వలేటివారిపాలెం, లింగసముద్రం, కందుకూరు మండలాలకు పూర్తిస్థాయిలో సాగునీటిని అందించేందుకు సహకరించాలని ముఖ్యమంత్రి కి ఎమ్మెల్యే వినతి పత్రం అందించారు. వెలిగొండ తూర్పు కాలువ 103 వ కిలోమీటరు నుంచి ప్రత్యేక కాలువ ద్వారా మూడు మండలాల్లోని చెరువులను కృష్ణా జలాలతో నింపాలని కోరారు. వెలిగొండ తూర్పు కాలువ నుంచి సుమారు 100 కిలోమీటర్ల దూరం ప్రత్యేక కాలువ ఏర్పాటు చేసి, ఆ మధ్యలో ఇరువైపులా చెరువులకు నీటిని మళ్లించేలా చూడాలన్నారు. పాలేరు, మన్నేరు మధ్య ప్రాంతంలోని అన్ని చెరువులకు నీరు అందించగలిగితే శాశ్వతంగా సాగునీటి సమస్య పరిష్కారం అవుతుందని చెప్పారు. వలేటివారిపాలెం మండలం మొదలుకొని కందుకూరు మండలంలోని పలుకూరు చెరువువరకు కృష్ణా నీళ్లు పారించేలా సర్వే చేయించి, నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే నాగేశ్వరరావు ముఖ్యమంత్రిని అభ్యర్థించారు.

**రాళ్లపాడు రిజర్వాయర్ ద్వారా....**

వెలిగొండ ప్రాజెక్టు నుంచి రాళ్లపాడు రిజర్వాయర్ కు పూర్తిస్థాయిలో నీరు సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కి ఎమ్మెల్యే నాగేశ్వరరావు మెమొరాండం అందజేశారు. వెలుగొండ ప్రాజెక్టు తూర్పు కాలువ ద్వారా 129 వ కిలోమీటర్ నుంచి ప్రత్యేక కాలువ ద్వారా రాళ్లపాడుకు 1.7 టీఎంసీల నీటి విడుదల కోసం గతంలో జీవో కూడా ఇచ్చారని ఎమ్మెల్యే గుర్తు చేశారు. అది కార్యరూపం దాల్చితే సుమారు 25 వేల ఎకరాలకు సాగునీటితోపాటు వలేటివారిపాలెం, లింగసముద్రం, గుడ్లూరు మండలాలకు తాగునీరు అందుతుందని వివరించారు. భవిష్యత్తులో ఇబ్బందులు ఉండవన్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని పవన్ కళ్యాణ్ కి నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. మరోవైపు సభ వేదికపై ముఖ్యమంత్రి కూడా ఈ విషయాన్ని ప్రస్తావిస్తూ రాళ్లపాడు రిజర్వాయర్ ద్వారా తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ప్రకటించారు. అంతకుముందు హెలిపాడ్ వద్ద ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి లకు ఎమ్మెల్యే నాగేశ్వరరావు స్వాగతం పలికారు.




# పల్లె పండుగ సభకు భారీగా తరలివెళ్లిన కూటమి పార్టీల శ్రేణులు

## -ఎమ్మెల్యే ఇంటూరి ఆధ్వర్యంలో వెల్లువెత్తిన ఉత్సాహం





**కందుకూరు పెన్ పవర్, సెప్టెంబర్ 29:**
ఉదయగిరి నియోజకవర్గం వరికుంటపాడు మండలం రామాపురంలో పల్లె పండుగ 3.0 కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మంగళవారం ప్రారంభించగా ఆ కార్యక్రమానికి కందుకూరు నియోజకవర్గం నుంచి పెద్ద సంఖ్యలో తరలి వెళ్లారు. ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రతి గ్రామం నుంచి వేలాదిగా జనం బయలుదేరి వెళ్లారు. సుమారు 200 బస్సులు, 150కి పైగా కార్లలో తెలుగుదేశం, బిజెపి, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా సభా ప్రాంగణానికి చేరుకున్నారు. వలేటివారిపాలెంలో టీడీపీ సీనియర్ నాయకులు, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావులు జెండా ఊపడంతో బస్సులు బయలుదేరాయి.

కందుకూరు పట్టణం సహా 5 మండలాల నుంచి యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమంలో పాలుపంచుకున్నారు. మధ్యలో మాలకొండ దేవస్థానం సమీపంలోని రాజుగారి కొష్టాలు వద్ద ఎమ్మెల్యే ఆధ్వర్యంలో వేలాదిమందికి భోజన వసతి ఏర్పాటు చేశారు. అనంతరం బస్సులు, కార్లు ర్యాలీగా రామాపురం చేరుకోగా అక్కడి కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకురాలు ఎం. శ్రావణిరెడ్డి, చల్లా శ్రీనివాసరావు, ఏఎంసీ చైర్మన్ రాయపాటి సుభాషిని శ్రీనివాసరావు, పట్టణ టిడిపి అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు, మాదాల లక్ష్మీనరసింహం, మండల పార్టీల అధ్యక్షులు రాచగర్ల సుబ్బారావు, పూరిమిట్ల గురునాథం, జనిగర్ల నాగరాజు, బుస్సారెడ్డి కృష్ణారెడ్డి, గ్రామ వార్డు అధ్యక్షులు, అనుబంధ సంఘాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# నూతన కార్యవర్గ ఎన్నిక




**పొదిలి, పెన్ పవర్, సెప్టెంబర్ 29**
పొదిలి లోని రెండు పాఠశాలలకు నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. మంగళవారం నాడు స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, స్థానిక నవాబ్ మిట్ట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలకు నూతన కార్యవర్గ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల మేనేజ్మెంట్ కమిటీ చైర్మన్ గా షేక్. ఖాదర్ బి, వైస్ చైర్మన్ గా జి. వెంకటలక్ష్మి లు ఎన్నికయ్యారు. అదేవిధంగా పట్టణంలోని నవాబ్ మెట్ట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల మేనేజ్మెంట్ కమిటీ చైర్మన్ గా షేక్. నాసర్ బి, వైస్ చైర్మన్ గా షేక్. మెహర్ ఉన్నిసా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయా పాఠశాలలకు ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యుల చేత ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు ఎండి. గౌస్, షేక్. యాసీన్ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ ఎం సి ఎన్నికలు ఏకగ్రీవం

### - జిల్లా సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ అనిల్ కుమార్ దాసరి




**ఒంగోలు కలెక్టరేట్, పెన్ పవర్ సెప్టెంబర్ 29**
కొత్తపట్నం మండలంలో ఎస్ఎంసి ఎన్నికల కార్యక్రమం కొత్తపట్నం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, గమండ్లపాలెం నందు నిర్వహించిన ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి జిల్లా సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ అనిల్ కుమార్ దాసరి హాజరై ఎన్నికల ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఎంసి చైర్మన్‌గా బి. పోతరాజు , వైస్ చైర్మన్‌గా జి. త్రివేణి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో ఎం ఐ సి అండ్ ప్లానింగ్ కోఆర్డినేటర్ ఎంజాల రత్నం, కొత్తపట్నం మండల విద్యాశాఖ అధికారి-2 టి. పద్మావతి, ప్రధానోపాధ్యాయురాలు పి.వి. సుకన్య పాల్గొన్నారు. అనంతరం మోటుమాల జడ్పిహెచ్ఎస్ పాఠశాలను సందర్శించి, నూతనంగా ఎన్నికైన ఎస్ఎంసి చైర్మన్, వైస్ చైర్మన్, సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. తదుపరి కెజిబివి పాఠశాలను సందర్శించి, ఎస్ఎంసి సభ్యుల ఎంపిక ప్రక్రియను పరిశీలించి, సభ్యులతో మాట్లాడి కార్యక్రమ వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాలలలో ఎస్ఎంసి ఎన్నికల ప్రక్రియ సజావుగా, పారదర్శకంగా జరిగేలా సంబంధిత అధికారులతో సమీక్షించారు.

# అనుమతి లేనిదే బోర్లు వేయరాదు

### వాల్టా చట్టం పకడ్బందీ అమలు

### ఎల్ నినో ప్రభావం వల్ల భూగర్భజల మట్టం పడిపోయింది

### మున్సిపల్ కమిషనర్ ఈ వి రమణ బాబు



**గిద్దలూరు పెన్ పవర్ సెప్టెంబర్ 29**
గిద్దలూరు పట్టణ పరిధిలో ఎల్ నినో ప్రభావం కారణంగా భూగర్భ జలమట్టం తగ్గుతున్నందున, భూగర్భ జలాల సంరక్షణను దృష్టిలో ఉంచుకొని అనుమతులు లేకుండా బోర్లు వేయడం నిషేధించబడినదని, గిద్దలూరు పురపాలక సంఘం, సంబంధిత భూగర్భ జలాల శాఖ ల అనుమతులు లేకుండా బోర్లు వేసే వ్యక్తులు/సంస్థలపై నిబంధనల ప్రకారం కఠినమైన చర్యలు తీసుకోబడునని మున్సిపల్ కమిషనర్ రమణ బాబు తెలిపారు. గిద్దలూరు పట్టణ ప్రజలు ఎటువంటి అనుమతులు లేకుండా బోర్లు వేయకుండా, సంబంధిత శాఖల నుండి ముందస్తు అనుమతులు పొందిన తరువాత మాత్రమే బోర్లు ఏర్పాటు చేసుకోవలసిందిగా కమీషనర్ తెలిపారు. గిద్దలూరు పురపాలక సంఘం పరిధిలో ఎక్కడ బోరు వేసినా వాల్టా చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎల్ ని నో ప్రభావం తో వర్షాభవపరిస్తితులు నెలకొన్నాయని , ఫలితంగా భూగర్భజలాలు పూర్తి స్థాయిలో పడిపోయాయని ఆయన తెలిపారు. అనుమతులు లేకుండా బోర్లు వేస్తే సీజ్ చేస్తామన్నారు.

# మాల్యాద్రి కుటుంబంపై కేసులపై సమగ్ర విచారణ జరపాలి

### -ఆరోపణలు నిరాధారమైతే వెంటనే ఎత్తివేయాలి - బీసీ, యాదవ జేఏసీ నాయకుల డిమాండ్

### -రాజకీయ ఒత్తిళ్లకు తావులేకుండా న్యాయపరంగా సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి



**బ్యూరో పెన్ పవర్, ప్రకాశం సెప్టెంబర్ 29:**
కందుకూరు యాదవ నాయకుడు, మాజీ కౌన్సిలర్ దాసరి మాల్యాద్రి, ఆయన కుమారుడిపై నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులపై సమగ్ర విచారణ జరిపించాలని 139 బీసీ కులాల జేఏసీ రాష్ట్ర కన్వీనర్ మిరియం శ్రీనివాసులు, యాదవ జేఏసీ ప్రకాశం జిల్లా అధ్యక్షుడు చిరుమామిళ్ల గోపికృష్ణ యాదవ్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బంకా చిరంజీవి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కందుకూరు మున్సిపాలిటీలో సమీప గ్రామాల విలీనానికి సంబంధించిన వ్యవహారం సుమారు 13 సంవత్సరాలుగా హైకోర్టులో కొనసాగుతోందన్నారు. ఈ కేసును ఉపసంహరించుకోవాలని దాసరి మాల్యాద్రిపై ఒత్తిడి తీసుకొచ్చినట్లు ఆరోపించారు. న్యాయపోరాటాన్ని కొనసాగిస్తానని మాల్యాద్రి స్పష్టం చేయడంతో పోలీసు కేసుల పేరుతో బెదిరింపులకు పాల్పడినట్లు తమకు సమాచారం ఉందని మిరియం శ్రీనివాసులు పేర్కొన్నారు. మాల్యాద్రి, ఆయన కుమారుడిపై నమోదైన కేసులు కూడా అదే ఒత్తిళ్లలో భాగమేనా అన్న అనుమానాలు ఉన్నాయని, దీనిపై అధికారులు నిష్పక్షపాతంగా విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని కోరారు. చట్టపరమైన సమస్యలకు న్యాయస్థానాల్లోనే పరిష్కారం వెతకాలని, కేసుల ద్వారా ఎవరినీ భయభ్రాంతులకు గురిచేయడం సరికాదన్నారు.

**యాదవుల సమస్యలను పరిష్కరించాలి...**
ఒకవైపు యాదవులు టీడీపీకి వెన్నుముకగా ఉన్నారని చెబుతూ, మరోవైపు ఆ సామాజిక వర్గానికి చెందిన నాయకులపై కేసులు నమోదవుతున్నాయన్న ఆరోపణలు రావడం బాధాకరమని శ్రీనివాసులు అన్నారు. యాదవుల సమస్యలను పరిష్కరించి, రాజకీయ ఒత్తిళ్లకు గురిచేయకుండా చూడాలని కోరారు.కందుకూరు పట్టణంలో యాదవ సామాజిక వర్గానికి చెందిన విలువైన స్థలాల ఆక్రమణలపై కూడా ఆరోపణలు వస్తున్నాయని, సంబంధిత అధికారులు వాటిపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలు తేల్చాలని డిమాండ్ చేశారు.

**న్యాయపరంగానే సమస్యకు పరిష్కారం...**
యాదవ జేఏసీ జిల్లా అధ్యక్షుడు చిరుమామిళ్ల గోపికృష్ణ యాదవ్ మాట్లాడుతూ యాదవ సామాజిక వర్గానికి చెందిన నాయకులు, ప్రజలకు అన్యాయం జరిగితే చట్టబద్ధమైన మార్గాల్లో పోరాడతామని తెలిపారు. మాల్యాద్రి, ఆయన కుమారుడిపై నమోదైన కేసుల వెనుక ఉన్న వాస్తవాలను వెలికితీసి, విచారణ నిష్పక్షపాతంగా నిర్వహించాలని కోరారు. బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బంకా చిరంజీవి మాట్లాడుతూ బీసీ వర్గాలకు న్యాయం జరిగేలా ప్రభుత్వం, అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. మున్సిపాలిటీ విలీనానికి సంబంధించిన వ్యవహారం న్యాయస్థానంలో ఉన్నందున దానిని న్యాయపరంగానే పరిష్కరించుకోవాలని, వ్యక్తిగత ఒత్తిళ్లు, బెదిరింపులకు తావు ఉండకూడదని అన్నారు. దాసరి మాల్యాద్రి కుటుంబానికి న్యాయం జరిగే వరకు ప్రజాస్వామ్యబద్ధంగా తమ పోరాటాన్ని కొనసాగిస్తామని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా యాదవ నాయకులు చల్లా హరి, యాదవ జేఏసీ ప్రధాన కార్యదర్శి దూళ్ల అప్పారావు, కంభంపాటి రాజబాబు, మురళీకృష్ణ, నతీష్, ఓంకార్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

# నేడు ఒంగోలు జీజీహెచ్‌లో మెగా మెడికల్ క్యాంప్

**ఒంగోలు క్రైమ్, పెన్ పవర్ సెప్టెంబర్ 29**
సేవా సంకల్ప్ అభియాన్ కార్యక్రమాల్లో భాగంగా గురువారం ఒంగోలు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (జీజీహెచ్)లో మెగా మెడికల్ క్యాంప్ నిర్వహించనున్నట్లు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్. మాణిక్యరావు, జిల్లా వైద్య అధికారి డా వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ మేరకు మెడికల్ క్యాంప్ నిర్వహణ పై డిఎంహెచ్ఓ సిబ్బంది, జి జి హెచ్ హెచ్ ఓ డి లు, నర్సింగ్ ప్రిన్సిపల్స్ తో సూపరింటెండెంట్ సమావేశమై సమీక్ష నిర్వహించారు. జీజీహెచ్ మెడికల్ కాలేజీ ఆవరణలోని క్రిటికల్ కేర్ బ్లాక్ బ్లాక్‌లో నిర్వహించే ఈ మెగా వైద్య శిబిరంలో వివిధ వైద్య విభాగాలకు చెందిన నిపుణులైన వైద్యులు పాల్గొని ప్రజలకు వైద్య పరీక్షలు, సలహాలు అందించనున్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు క్యాంపు నిర్వహిస్తున్నారు అని తెలిపారు. ఈ శిబిరంలో ఆఫ్తాల్మాలజీ, జనరల్ సర్జరీ, ఆర్థోపెడిక్స్, పల్మనాలజీ, ప్రసూతి--స్త్రీ వైద్య విభాగం (ఓడిడజి), పీడియాట్రిక్స్, డెంటల్, ఆయుష్ , డెర్మటాలజీ, కంటి విభాగం, తదితర విభాగాలకు చెందిన వైద్య నిపుణులు అందుబాటులో ఉంటారని తెలిపారు. అవసరమైన వారికి సంబంధిత విభాగాల్లో తదుపరి వైద్య సేవలు అందించేందుకు మార్గనిర్దేశం చేయనున్నట్లు చెప్పారు. అదేవిధంగా శిబిరంలో ఎక్స్‌రే, ల్యాబొరేటరీ పరీక్షలు, రక్తంలో చక్కెర (షుగర్) పరీక్షలు తదితర వైద్య పరీక్షలు నిర్వహించి, వ్యాధి నిర్ధారణకు



అవసరమైన వైద్య సలహాలు అందించనున్నట్లు సూపరింటెండెంట్ తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో సమన్వయం చేసుకుంటూ ఈ మెగా మెడికల్ క్యాంప్‌ను నిర్వహిస్తున్నామని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ ఆరోగ్యాన్ని పరీక్షించుకోవాలని డాక్టర్ మాణిక్యరావు కోరారు. సెప్టెంబర్ 30 గురువారం నిర్వహించే ఈ మెగా మెడికల్ క్యాంప్‌కు ప్రజలు అధిక సంఖ్యలో హాజరై ఉచిత వైద్య పరీక్షలు, నిపుణుల వైద్య సలహాలు పొందాలని ఆయన సూచించారు. ఈ సమావేశం లో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ , డా ప్రభాకర్, తిరుపతి రెడ్డి, డా బాలాజీ, డి ఈ టి ఓ , డిఐఓ కమల శ్రీ, ఏఆర్ఎంఓ డా లక్ష్మ నాయక్, డాక్టర్ తేజ, నర్సింగ్ స్కూల్ ప్రిన్సిపాల్ సుజాత రాణి, వైస్ ప్రిన్సిపాల్ అరుణ కుమారి,తదితరులు పాల్గొన్నారు.

# అల్లూరి పోలేరమ్మ తల్లికి సిమెంట్ రోడ్డు వేయండి : భక్తుల ఆవేదన

**మార్కాపురం,పెన్ పవర్ సెప్టెంబర్ 29**
మార్కాపురాన్ని కాపాడే గ్రామదేవత... కలెక్టరేట్ కు వెళ్లే దారిలో కొలువైన తల్లి శ్రీ అల్లూరి పోలేరమ్మ అమ్మవారి ఆలయానికి సిమెంట్ రోడ్డు లేక భక్తులు బురదలో నడుస్తూ అమ్మను దర్శించుకుంటున్నారు. దేవాదాయ శాఖ పరిధిలో ఉన్న ఈ ఆలయానికి నిత్యం వందలాది మంది భక్తులు వస్తుంటారు. కానీ ఆలయానికి వెళ్లే దారిలో సరైన రోడ్డు లేక వర్షాకాలంలో బురదమయంగా మారి వృద్ధులు, మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కనీసం నడిచే దారి కూడా లేకపోవ డంతో భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి అమావాస్యకు స్థానిక ఎమ్మెల్యే కందుల నారాయ



ణరెడ్డి స్వయంగా వచ్చి అమ్మవారిని దర్శించుకుని, అన్నదానం చేయడం భక్తుల్లో భరోసా నింపుతోంది. అమ్మవారిపై ఆయనకున్న భక్తి అందరికీ తెలుసు. అందుకే తమ చిరకాల కోరికను ఆయనే తీర్చాలని భక్తులు వేడుకుంటున్నారు.ఎమ్మెల్యే గారూ.. మీరు 35 కోట్లతో పట్టణంలో రోడ్లు వేస్తున్నారు. దయచేసి మా పోలేరమ్మ తల్లి ఆలయానికి ఒక సిమెంట్ రోడ్డు వేయించండి. మీ చేతుల మీదుగా ఆ రోడ్డు పడితే అమ్మ వారి ఆశీస్సులు మార్కాపురానికి ఎల్లవేళలా ఉంటాయి అంటూ భక్తులు మనస్ఫూర్తిగా కోరుతున్నారు.దేవాదాయ శాఖతో మాట్లాడి వెంటనే సిమెంట్ రోడ్డు, మౌలిక వసతులు కల్పించాలని భక్తులంతా ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డికి విజ్ఞప్తి చేస్తున్నారు.

# కాకుమాను కుటుంబానికి అండగా ఉంటాం

### - వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి

### - మాజీ లిడ్క్యాప్ చైర్మన్ దివంగత కాకుమాను రాజశేఖర్ కుటుంబాన్ని పరామర్శించిన వైయస్ జగన్




**ఒంగోలు టౌన్, పెన్ పవర్ సెప్టెంబర్ 29**
వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం ఒంగోలులో పర్యటించారు. ఒంగోలు క్లౌపేటలోని వైఎస్సార్‌సీపీ ప్రచార విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ లిడ్క్యాప్ ఛైర్మన్ దివంగత కాకుమాను రాజశేఖర్ నివాసానికి వెళ్లిన వైయస్ జగన్, ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. కాకుమాను రాజశేఖర్ మృతిపై తీవ్ర సంతాపం వ్యక్తం చేసిన వైయస్ జగన్, ఆయన కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కష్టసమయంలో ధైర్యంగా ఉండాలని వారిని ఓదార్చారు. రాజశేఖర్ పార్టీకి అందించిన సేవలను ఈ సందర్భంగా జగన్ గుర్తుచేసుకున్నారు. పార్టీ పట్ల నిబద్ధతతో, అంకితభావంతో ఆయన పనిచేశారని పేర్కొన్నారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటని అన్నారు. రాజశేఖర్ కుటుంబం ఒంటరిది కాదని, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ వారికి అండగా ఉంటుందని వైయస్ జగన్ భరోసా ఇచ్చారు. కుటుంబానికి అవసరమైన అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. కుటుంబ సభ్యులతో కొద్దిసేపు మాట్లాడి, వారికి ధైర్యం చెప్పిన అనంతరం వైయస్ జగన్ అక్కడి నుంచి తిరుగు ప్రయాణమయ్యారు.

# కృత్రిమ మేధ--సైబర్ భద్రతపై అధ్యాపకులకు అధునాతన శిక్షణ

### -ప్రకాశం ఇంజినీరింగ్ కళాశాలలో

### వారాంత ఆన్‌లైన్ ఎఫ్‌డీపీ విజయవంతం

**కందుకూరు పెన్ పవర్ సెప్టెంబర్ 29**
కృత్రిమ మేధ (ఏఐ), సైబర్ భద్రత రంగాల్లో చోటుచేసుకుంటున్న ఆధునిక సాంకేతిక పరిణామాలపై అధ్యాపకులు నిరంతరం అవగాహన పెంపొందించుకోవాలని ప్రకాశం ఇంజినీరింగ్ కళాశాల కరస్పాండెంట్ డా. కె. విజయ శ్రీనివాస్ సూచించారు. ప్రకాశం ఇంజినీరింగ్ కళాశాల (స్వయంప్రతిపత్తి) కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ (సైబర్ సెక్యూరిటీ) విభాగం ఆధ్వర్యంలో "నెక్స్ట్-జనరేషన్ ఏఐ ఆర్కిటెక్చర్స్ ఫర్ రెసిలియెంట్ సైబర్ డిఫెన్స్" అంశంపై నిర్వహించిన వారాంత ఆన్‌లైన్ అధ్యాపకుల అభివృద్ధి కార్యక్రమం (ఎఫ్‌డీపీ) శనివారం విజయవంతంగా ముగిసింది. ఈ సందర్భంగా డా. విజయ శ్రీనివాస్ మాట్లాడుతూ అధ్యాపకులు బోధనతో పాటు పరిశోధన, ఆవిష్కరణలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఏఐ, సైబర్ సెక్యూరిటీ వంటి అత్యాధునిక సాంకేతిక రంగాల్లో నైపుణ్యాలను ఎప్పటికప్పుడు పెంపొందించుకోవాలని అన్నారు. పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దడంలో ఇటువంటి శిక్షణా కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు.ఎఫ్‌డీపీలో డా. టి. నళిని (సవీత యూనివర్సిటీ, చెన్నై), డా. హరీష్ రమణి (టెవెల్ సైబర్ కార్ప్స్ ప్రైవేట్ లిమిటెడ్), డా. కమలకన్నన్ మచాప్ (ఏషియా పసిఫిక్ యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్, మలేషియా), రాజ్‌కుమార్ ఎం. (పార్గవన్ సైబర్ సొల్యూషన్స్) తదితరులు పాల్గొని ఏఐ ఆధారిత సైబర్ భద్రత, ఆధునిక రక్షణ వ్యవస్థలు, పరిశోధన ధోరణులు, పరిశ్రమ అవసరాలపై అధ్యాపకులకు అవగాహన కల్పించారు.సైబర్ సెక్యూరిటీ విభాగాధిపతి డా. కె. సుబ్బారెడ్డి మాట్లాడుతూ అధ్యాపకుల బోధనా, పరిశోధనా సామర్థ్యాలను మరింత పెంపొందించడమే ఎఫ్‌డీపీ ప్రధాన లక్ష్యమని తెలిపారు. కార్యక్రమ సమన్వయకర్త ఎస్.కె. రీనా ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

# నకిలీ సిగరెట్ల కలకలం..!

**– 'ఫ్లేక్' ప్యాకెట్లపై వినియోగదారుల ఆరోపణలు – ఇతర బ్రాండ్లపైనా నకిలీ సరుకు వస్తోందని సమాచారం**

**– ప్యాకేజింగ్, ముద్రణలో తేడాలపై అనుమానాలు – అధికారులు తనిఖీలు నిర్వహించాలని డిమాండ్**






**మార్కాపురం (స్టాఫ్ రిపోర్టర్) పెన్ పవర్ సెప్టెంబర్ 29**

పట్టణంలో సిగరెట్ విక్రయాలపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా కొన్ని బ్రాండ్ సిగరెట్ ప్యాకెట్లు నకిలీవిగా ఉన్నాయని పలువురు వినియోగదారులు ఆరోపిస్తున్నారు. తాము గతంలో కొనుగోలు చేసిన ప్యాకెట్లతో పోలిస్తే ప్రస్తుతం లభిస్తున్న వాటి ప్యాకేజింగ్, ముద్రణ, తయారీ వివరాల్లో తేడాలు కనిపిస్తున్నాయని చెబుతున్నారు.

ఇటీవల సిగరెట్లు కొనుగోలు చేసిన పలువురు వినియోగదారులతో మాట్లాడగా ప్యాకెట్ల నాణ్యత, ముద్రణ తదితర అంశాలను బట్టి అవి అసలైన ఉత్పత్తులు కావని అనుమానం వ్యక్తం చేశారు. కొందరు వీటిని నకిలీ సిగరెట్లుగా పేర్కొన్నారు. అయితే ఈ ఆరోపణలపై సంబంధిత శాఖల అధికారిక నిర్ధారణ రావాల్సి ఉంది.

**ఇతర బ్రాండ్లపైనా..:** కేవలం 'ఫ్లేక్' సిగరెట్లకే పరిమితం కాకుండా ఇతర కంపెనీలకు చెందిన సిగరెట్ల విషయంలోనూ నకిలీ సరుకు వస్తోందన్న ఆరోపణలు స్థానికంగా వినిపిస్తున్నాయి. వివిధ బ్రాండ్ల ప్యాకెట్లను అధికారులు పరిశీలిస్తే అసలు పరిస్థితి వెల్లడయ్యే అవకాశం ఉంది.

**సరఫరా ఎక్కడి నుంచి..?..:** ఒకవేళ నకిలీ సిగరెట్లు ఉన్నట్లు తేలితే.. వాటి సరఫరా ఎక్కడి నుంచి జరుగుతోంది, ఎవరు మార్కాపురానికి తీసుకొస్తున్నారు, ఏయే దుకాణాలకు సరఫరా చేస్తున్నారు, అన్నది తేలాల్సి ఉంది. సరఫరా మార్గాన్ని పరిశీలిస్తే వ్యవహారం వెనుక ఉన్న వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

**తనిఖీలు చేపట్టాలి..:** సిగరెట్ ప్యాకెట్లపై అనుమానాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో సంబంధిత అధికారులు మార్కాపురంలోని దుకాణాల్లో తనిఖీలు నిర్వహించాలని వినియోగదారులు కోరుతున్నారు. ప్యాకెట్లపై ఉన్న తయారీదారు వివరాలు, బ్యాచ్ నంబర్లు, ఎంఆర్పీ, పన్ను వివరాలు, ప్యాకేజింగ్ తదితర అంశాలను పరిశీలించాలని డిమాండ్ చేస్తున్నారు. అవసరమైతే అనుమానాస్పద ప్యాకెట్ల నమూనాలను పరీక్షలకు పంపాలని కోరుతున్నారు.

**నిజమేమిటో తేల్చాలి..:** ప్రస్తుతం వినియోగదారులు చేస్తున్నవి ఆరోపణలు మాత్రమే. ప్యాకెట్ రూపం లేదా ఫొటో ఆధారంగా సిగరెట్లు నకిలీవని తుది నిర్ణయానికి రాలేం. సంబంధిత అధికారులు తనిఖీలు నిర్వహించి, తయారీదారు వివరాలను ధ్రువీకరించి, అవసరమైన పరీక్షలు నిర్వహించిన తర్వాతే వాస్తవం తేలనుంది.వినియోగదారుల ఆరోపణలు నిజమని తేలితే నకిలీ సిగరెట్ల సరఫరా వెనుక ఉన్న మూలాలను గుర్తించి చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. అవి అసలైనవేనని తేలితే ప్రస్తుతం వ్యక్తమవుతున్న అనుమానాలకు తెరపడనుంది. మార్కాపురంలో సిగరెట్ విక్రయాలపై నెలకొన్న సందేహాలకు అధికారుల తనిఖీలే స్పష్టమైన సమాధానం ఇవ్వాల్సి ఉంది.

## ఘనంగా అంగన్‌వాడీ ఉత్సవాలు





**మార్కాపురంపెన్ పవర్ సెప్టెంబర్ 29**

పట్టణంలోని 57, 58 కోడ్ నంబర్ల అంగన్‌వాడీ కేంద్రాల్లో సోమవారం అంగన్‌వాడీ ఉత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది.ఈ కార్యక్రమానికి ఐసీడీఎస్ పీడీ ఎం. పద్మావతి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె తల్లులను ఉద్దేశించి మాట్లాడుతూ చిరుధాన్యాలతో తయారు చేసిన ఆహారం బలమైనదని, జంక్ ఫుడ్ ను పూర్తిగా పక్కన పెట్టాలని సూచించారు. మినుము, శనగల వంటి పప్పు ధాన్యాల్లో మినరల్స్ పుష్కలంగా ఉంటాయని, వాటిని రోజూ తీసుకోవడం వల్ల త్రిఫల ఆహారం అవుతుందని, దీనివల్ల శరీరానికి కావలసిన అన్ని పోషకాలు అందుతాయని తెలిపారు.ప్రస్తుతం అంగన్‌వాడీల్లో బాలామృతంతో పాటు బిస్కెట్లు, కేక్, గట్టెలు వంటివి ఎక్కువ రకాలుగా తయారు చేసి పిల్లలకు అందిస్తున్నామని, ఇవి పిల్లల్లో బలాన్ని పెంచుతాయని అన్నారు. అనంతరం 58వ కోడ్ అంగన్‌వాడీ కేంద్రానికి సంబంధించిన సుదర్ పోషణ భాగ్య నగరం బాలోత్సవాన్ని తల్లులకు, పిల్లలకు నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్త శివక్క ఆధ్వర్యంలో తల్లులతో పోషణ ప్రతిజ్ఞ చేయించి, వారికి అవగాహన కల్పించారు. అనంతరం తల్లులతో అంగన్‌వాడీ ఉత్సవాల ర్యాలీ నిర్వహించారు పీడీ పద్మావతి 57, 58 కోడ్ అంగన్‌వాడీ కేంద్రాల కార్యక్రమాలను సమీక్షించారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ రవి మరియా, అంగన్‌వాడీ కార్యకర్తలు శోభాదేవి, రామసుబ్బు, రంగలక్ష్మి, దేవమ్మ, శివలీల, ఆయాలు నారమ్మ, అల్లమ్మ తదితరులు, తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.

## పొదిలిలో భానుచందర్‌కు పలువురే ఘన నివాళి





**పొదిలి, పెన్ పవర్, సెప్టెంబర్ 29**

పొదిలిలో అనారోగ్య కారణాల వల్ల మరణించిన సీనియర్ రిపోర్టర్ పింగళి భానుచందర్ మృతదేహాన్ని సందర్శించే పలువురు ఘన నివాళులు అర్పించారు. సీనియర్ పాత్రికేయులు భానుచందర్ అనారోగ్య కారణంగా బాధపడుతూ మంగళవారం నాడు తమ నివాస గృహంలో మరణించారు. ఈ సమాచారం తెలుసుకున్న మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి తో పాటు, పొదిలి ఏఎంసీ చైర్మన్ డాక్టర్ సయ్యద్ ఇమామ్ సా, మాజీ శాసనసభ్యులు వైకాపా మార్కాపురం ఇన్చార్జి అన్నా వెంకట రాంబాబు, వైకాపా నాయకురాలు షేక్. నూర్జహాన్ బేగం తదితరులు భానుచందర్ మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. అలాగే ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు.

## అంగన్వాడీల బలోపేతానికి సమాజ భాగస్వామ్యం అవసరం - మక్కెన జగదీష్





**సంతమాగులూరు, పెన్ పవర్, సెప్టెంబర్ 29**

అంగన్వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అందుతున్న పోషకాహారాన్ని మరింత మెరుగుపరచడంతో పాటు కేంద్రాల అభివృద్ధికి సమాజ భాగస్వామ్యం అవసరమని తెలుగుదేశం పార్టీ నాయకులు మక్కెన జగదీష్ అన్నారు. సంతమాగులూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ సుధా ఆధ్వర్యంలో మక్కెనవారిపాలెం గ్రామంలో మంగళవారం పోషణ మాసం, అంగన్వాడీ ఉత్సవ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మక్కెన జగదీష్ అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించి కేంద్రంలో ఎంతమంది లబ్ధిదారులు ఉన్నారు, వారికి అందుతున్న సేవలు, మౌలిక వసతుల పరిస్థితిపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అంగన్వాడీ కేంద్రాలు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు కొనసాగించాలని సూచించారు. కేంద్రాలకు అవసరమైన మౌలిక వసతులు, ఇతర సదుపాయాలు ఏమైనా అవసరమైతే తన దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారానికి సహకరిస్తామని తెలిపారు. అనంతరం లబ్ధిదారులకు టేక్‌హోమ్ రేషన్‌ను పంపిణీ చేశారు.

**తక్కువ ఖర్చుతో అధిక పోషక విలువలు**

పోషణ మాసంలో భాగంగా చిరుధాన్యాల ప్రాధాన్యతపై లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. తక్కువ ఖర్చుతోనే చిరుధాన్యాలు, స్థానికంగా లభించే పోషక పదార్థాలతో అధిక పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తయారు చేసుకునే విధానాలను వివరించారు. చిన్నారుల శారీరక, మానసిక ఎదుగుదలకు సమతుల ఆహారం, పోషకాహారం ఎంతగానో అవసరమని సిబ్బంది వివరించారు.

**అంగన్వాడీ సేవలపై అవగాహన**

అంగన్వాడీ కేంద్రాల్లో అందిస్తున్న వన్‌డే వేడి భోజనం, సమాజ భాగస్వామ్యం, పీఎంఈవై తదితర అంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. అంగన్వాడీ ఉత్సవంలో భాగంగా చిన్నారులు, లబ్ధిదారులకు సంబంధించిన పలు కార్యక్రమాలను నిర్వహించి పోషకాహారం, ఆరోగ్యం, పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ జి. ప్రమీల, ఏల్చూరు సెక్టార్ పరిధిలోని 25 మంది అంగన్వాడీ టీచర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## జీవనశైలిలో మార్పులతో గుండె జబ్బులు నివారణ

**– ఒంగోలు ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీవాణి**




**ఒంగోలు క్రైమ్, పెన్ పవర్ సెప్టెంబర్ 29**

మంచి జీవనశైలి, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను పాటించడం ద్వారా గుండెజబ్బుల ముప్పును గణనీయంగా తగ్గించుకోవచ్చని ఒంగోలు ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీవాణి తెలిపారు. ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (జీజీహెచ్), ఒంగోలులో నిర్వహించిన అవగాహన ర్యాలీని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్. మాణిక్యరావుతో కలిసి డాక్టర్ శ్రీవాణి ప్రారంభించారు. ఈ ర్యాలీలో వైద్య విద్యార్థులు, విద్యార్థులు, వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, ఇతర సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రజలకు గుండె ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీవాణి మాట్లాడుతూ అవసరమైనప్పుడు వైద్యులను సంప్రదించి, వైద్యుల సూచనల మేరకు తగిన పరీక్షలు చేయించుకోవడం ద్వారా గుండెజబ్బులను ముందుగానే గుర్తించి, సరైన చికిత్స పొందవచ్చన్నారు. జీవనశైలిలో మార్పులు చేసుకోవడంతో పాటు సమతుల్యమైన ఆహారం తీసుకోవడం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం, ఆరోగ్యంపై శ్రద్ధ వహించడం ప్రతి ఒక్కరి దైనందిన జీవితంలో భాగం కావాలని సూచించారు. ఒంగోలులో అత్యాధునిక క్యాథ్‌ల్యాబ్ సౌకర్యం అందుబాటులో ఉందని, ప్రజలు ఈ వైద్య సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్. మాణిక్యరావు మాట్లాడుతూ గుండెజబ్బులకు సంబంధించి అత్యాధునిక క్యాథ్‌ల్యాబ్ సేవలు, యాంజియోగ్రామ్ వంటి పరీక్షలు జీజీహెచ్‌లో ఉచితంగా అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ప్రజలు ప్రభుత్వ ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న ఆధునిక వైద్య సదుపాయాలను వినియోగించుకుని, గుండె సంబంధిత సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా అవసరమైన సమయంలో వైద్యులను సంప్రదించాలని సూచించారు. గుండె ఆరోగ్యంపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తామని వైద్యాధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్డియాలజీ విభాగం వైద్యులు డాక్టర్ వెంకటేశ్వరరావు, డాక్టర్ మహేష్, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ డా మస్తాన్ భాష , నర్సింగ్ సూపరింటెండెంట్ ధన లక్ష్మి ఏఆర్ఎంవోలు, వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, ఇతర ఆసుపత్రి సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## మాజీ సిఎం వైఎస్ జగన్ ను కలిసిన మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు

**సి ఎస్ పురం, పెన్ పవర్ సెప్టెంబర్ 29**

వైఎస్ఆర్సిపి నాయకులు స్వర్గీయ కాకుమాను రాజశేఖర్ కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు మాజీ సిఎం వైయస్ జగన్మోహన్ రెడ్డి మంగళవారం ఒంగోలు వచ్చారు. ఈ సందర్భంగా ఏబిఎం కళాశాల ప్రాంగణంలో హెలిప్యాడ్ వద్ద కనిగిరి మాజీ ఎమ్మెల్యే ,విశాఖపట్నం పార్లమెంట్ వైసీపి పరిశీలకులు కదిరి బాబురావు మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి కి స్వాగతం పలికి అనంతరం జగన్ మోహన్ రెడ్డి వెంట కదిరి బాబురావు కాకుమాను రాజశేఖర్ నివాసగృహానికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేసారు.

## ప్రతి ఒక్కరూ స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగస్వామ్యం కావాలి

**ఎంపీడీవో మోహన్ కుమార్**





**గిద్దలూరు పెన్ పవర్ సెప్టెంబర్ 29**

ప్రతి ఒక్కరూ స్వచ్ఛభారత్ కార్యక్రమంలో పాలుపంచుకోవాలని ఎంపీడీవో మోహన్ కుమార్ తెలిపారు పంచాయతీ రాజ్ కమిషనర్ ఆదేశాల మేరకు చెత్త సంపద తయారీ కేంద్రం ద్వారా వర్మీ తయారీ ద్వారా క్లాప్ మిత్రలకు, పంచాయతీ డెవలప్మెంట్ అధికారులకు అవగాహన కల్పిచటము కొరకు మంగళవారము ఎక్స్ పోజర్ విజిట్ మండలములోని ఉయ్యాలవాడ గ్రామ పంచాయతీ లో నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా డోర్ టు డోర్ తిరుగుతూ తడి చెత్త పొడి చెత్త ఏ విధంగా వేరు చేయాలో గ్రామప్రజలకు తెలిపారు అంతేకాకుండా 15 రోజులకు ఒకసారి వచ్చే స్వచ్ఛరదాన్ని ఏ విధంగా ఉపయోగించుకోవాలో గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు గ్రామమంతా ర్యాలీ నిర్వహించి ప్రజలకు తడి చెత్త పొడి చెత్త మీద అవగాహన కల్పించారు, డిప్యూటీ ఎంపీడీవో రమేష్ బాబు చెత్త నుండి సంపద తయారీ కేంద్రం వద్ద మాట్లాడుతూ నాడెప్ తొట్లలో ఏ విధంగా తడి చెత్తను వేయాలో అలాగే తడి చెత్త నుండి వర్మిని ఏ విధంగా తయారు చేయాలో క్లాప్ మిత్రులకు వివరించారు. ఐ విఆర్ ఎస కాల్స్ గురించి అవగాహనా కల్పించారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛభారత్ కోఆర్డినేటర్ బాబురావు పంచాయతీ డెవలప్మెంట్ అధికారులు , క్లాప్ మిత్ర లు పాల్గొన్నారు.

## ఇడుపూరులో హోరాహోరీ

**ఒక్క ఓటుతో వైసీపీ మద్దతుదారుడి గెలుపు**



**మార్కాపురం, పెన్ పవర్ సెప్టెంబర్ 29**

మార్కాపురం మండలం ఇడుపూరు గ్రామంలో జరిగిన ఎస్ఎంసీ (స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ) ఎన్నికల్లో ఉత్కంఠ నెలకొంది. హోరాహోరీగా సాగిన ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మద్దతుదారుడు ఎస్.కె. నాసర్ ఒక్క ఓటు తేడాతో విజయం సాధించారు. ఎస్ఎంసీ చైర్మన్‌గా ఎస్.కె. నాసర్, వైస్ చైర్మన్‌గా దేవరకొండ శ్రీదేవి ఎన్నికైనట్లు అధికారులు ప్రకటించారు.ఒక్క ఓటు తేడాతో గెలుపు ఓటములు తేలడంతో ఈ ఎన్నిక స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. ఎన్నికల ప్రక్రియ నిబంధనల ప్రకారం ప్రశాంతంగా నిర్వహించామని అధికారులు తెలిపారు.

## తంబళ్లపల్లి ఎంపీపీ పాఠశాలలో ఎస్ఎంసీ ఎన్నిక తొలి ఏకగ్రీవం

**గిద్దలూరు పెన్ పవర్ సెప్టెంబర్ 29**



గిద్దలూరు మండలం తంబళ్లపల్లి గ్రామంలోని ఎంపీపి పాఠశాలలో పాఠశాల యాజమాన్య కమిటీ (ఎస్ఎంసీ) ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. విద్యార్థుల తల్లిదండ్రులందరూ తెలుగుదేశం పార్టీ మద్దత్తు దారుడు పగడాల వెంకటరమణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా పూర్తయింది.

## పొన్నలూరు పోలీస్స్టేషన్లో తనిఖీ చేసిన డి.ఎస్.పి

**పొన్నలూరు పెన్ పవర్ సెప్టెంబర్ 29**

స్థానిక పోలీస్ స్టేషన్ ను మంగళవారం కందుకూరు డి.ఎస్.పి బాలసుబ్రమణ్యం ఆకస్మిక తనిఖీ చేశారు. తదుపరి వివిధ రికార్డులను పరిశీలించి వాటి నిర్వహణలో తీసుకోవలసిన చర్యల గురించి వివరించారు. దీర్ఘకాలంగా పెండింగ్ లో ఉన్న కేసులను త్వరి తగతిన పరిష్కరించాలని సూచించారు అనంతరం స్టేషన్ పరిసరాలు వసతులు లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సిఐ వైవి రమణయ్య, ఎస్సై సత్యనారాయణ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# పల్లె పండుగ 3. 0 ప్రారంభోత్సవ సభకు తరలిన టిడిపి నాయకులు



**పొన్నలూరు పెన్ పవర్ సెప్టెంబర్ 29**

నెల్లూరు జిల్లా ఉదయగిరి నియోజకవర్గం రామాపురంలో పల్లె పండగ 3.0 ప్రారంభోత్సవ సభకు సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోల శ్రీ బాల వీరాంజనేయ స్వామి, మారి టైం బోర్డ్ చైర్మన్ దామచర్ల సత్య ఆదేశాల మేరకు మండల టిడిపి అధ్యక్షుడు అనుమోలు సాంబశివరావు ఆధ్వర్యంలో మంగళవారం వేలాది మంది టిడిపి నాయకులు గ్రామాల నుంచి బస్సుల్లో కారులో రామాపురం తరలి వెళ్లారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి నాయకులు కొండ్రగుంట శ్రీనివాసరావు, మండవ ప్రసాద్, పిల్లి వెంకటనారాయణ రెడ్డి, తెలుగు యువత అధ్యక్షుడు బోయపాటి రమణారెడ్డి, ఉన్నం కొండలరావు, పల్లపోతు రమేష్ బాబు, తానికొండ మహేంద్ర, దాసరి కృష్ణారావు, అనుమోలు సుధాకర్ బాబు, యర్రా నరేంద్ర, చల్లా శ్రీనివాసరావు, శ్రీనివాసులు, టిడిపి నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# వలేటివారిపాలెంలో సీసీ రోడ్డుకు శంకుస్థాపన

### హాజరైన మాజీమంత్రి దేవినేని ఉమా, ఎమ్మెల్యే ఇంటూరి





**వలేటివారిపాలెం, పెన్ పవర్ సెప్టెంబర్ 29**

పల్లె పండుగ 3.0 కార్యక్రమంలో భాగంగా, వలేటివారిపాలెం గ్రామంలో నిర్మించనున్న సిసి రోడ్డు పనులకు టిడిపి సీనియర్ నాయకులు, మాజీమంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు , ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మంగళవారం శంకుస్థాపన చేశారు. గ్రామంలో మెయిన్ రోడ్డు నుంచి సచివాలయం వరకు 20 లక్షలతో ఈ రోడ్డును నిర్మించబోతున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగేశ్వరరావు మాట్లాడుతూ పల్లె పండగ 3.0 కార్యక్రమం ద్వారా కందుకూరు నియోజకవర్గంలో 131 పనులకు 26.58 కోట్లు మంజూరయ్యాయని చెప్పారు. కందుకూరు మండలంలో 22 పనులకు 6.46 కోట్లు, వలేటివారిపాలెం మండలంలో 32 పనులకు 5.05 కోట్లు, లింగసముద్రం మండలంలో 36 పనులకు 7.69 కోట్లు, గుడ్లూరు మండలంలో 25 పనులకు 4.52 కోట్లు, ఉలవపాడు మండలంలో 16 పనులకు 2.85 కోట్లు మంజూరైనట్లు ఎమ్మెల్యే నాగేశ్వరరావు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు మాదాల లక్ష్మీనరసింహం, గ్రామ పార్టీ అధ్యక్షుడు కాకుమాని ఆంజనేయులు, పార్టీ నాయకులు కాకుమాని హర్ష, వలేటి నరసింహం, గుత్తా మహేశ్వరరావు, తిరుపతయ్య, మధు, కొండయ్య, అంజయ్య, తిరుపతిస్వామి, బూదాల మనోజ్, మాజీ సర్పంచ్ సాదు శ్రీలత, బత్తుల సుబ్బారావు నెల్లూరు పార్లమెంట్ ఉపాధ్యక్షులు ఉన్నం వీరాస్వామి, ఒంగోలు డైరీ మాజీ చైర్మన్ చల్లా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రశాంతంగా ముగిసిన పాఠశాల విద్యా కమిటీ ఎన్నికలు

**దొనకొండ సెప్టెంబర్ 29 పెన్ పవర్**

మండలంలోని పోలేపల్లి మండల పరిషత్ ప్రాథమిక ఆదర్శ పాఠశాల లో స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ ఎస్ ఎం సి. చైర్మన్ గా ఎం మరియా బాబు వైస్ చైర్మన్ గా బి అంజలి ఎన్నికయ్యారని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆదిమూలపు ప్రభుదాసు తెలిపారు. ఎస్ఎంసి ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో ముగిశాయని అంటూ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించుటకు సహకరించిన విద్యార్థుల తల్లిదండ్రులకు గ్రామ పెద్దలకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆదిమూలపు ప్రభుదాసు ధన్యవాదములు తెలిపారు. ఎం మరియా బాబు మాట్లాడుతూ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆదిమూలపు ప్రభుదాసు కు ధన్యవాదములు తెలిపారు పోలేపల్లి లోని మండల పరిషత్ ప్రాథమిక ఆదర్శ పాఠశాల కు చైర్మన్ గా ఎన్నిక కావడం చాలా సంతోషంగా ఉన్నదని పాఠశాల అభివృద్ధికి విద్యార్థుల అభివృద్ధికి పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పనకు తన వంతుగా కృషి చేస్తానని ఎస్ఎంసి చైర్మన్ తెలిపారు ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆదిమూలపు ప్రభుదాసు పి పావని పాఠశాల సిబ్బంది విద్యార్థుల తల్లిదండ్రులు మరియు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



# ఒంగోలు మునిసిపల్ శతాబ్దిన్నర ఘన చరిత్రను చాటుదాం

### - ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ రావు - వేడుకలకు ప్రజలందరూ తరలి రావాలి

### - ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి

**ఒంగోలు టౌన్, పెన్ పవర్ సెప్టెంబర్ 29**

ఒంగోలు మున్సిపాలిటీ ఘన చరిత్రను తెలియజేసేందుకు 150 సంవత్సరాలు వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహిస్తున్న ఉత్సవాలను ప్రజలతోపాటు పార్టీ శ్రేణులు విరివిగా పాల్గొని విజయవంతం చేయవలసిందిగా ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్దన్ రావు కోరారు. మంగళవారం ఒంగోలు మున్సిపాలిటీ ఏర్పడి 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా బుధవారం నిర్వహించనున్న వేడుకలు విజయవంతం చేసేందుకు గుంటూరు రోడ్డులోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఒంగోలు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ విస్తృతస్థాయి సమావేశం నగర టిడిపి అధ్యక్షులు బండారు మదన్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా దామచర్ల జనార్దన్ రావు మాట్లాడుతూ ఒంగోలు పురపాలక సంఘం ఏర్పడి 150 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా గత రెండు నెలలుగా అనేక కార్యక్రమాలు చేపట్టామన్నారు. చర్చి సెంటర్లో అశోక స్థూపం, ఒంగోలు అభివృద్ధికి కృషి చేసిన మహనీయుల విగ్రహాలను కిమ్స్ హాస్పిటల్ జంక్షన్ వద్ద ఏర్పాటు చేశామన్నారు. ఆయా మహనీయుల కుటుంబ సభ్యులు అక్కడికి వచ్చి ఫోటోలు దిగి తనను అభినందించారన్నారు. ఒంగోలు నగర ప్రజల ఆరోగ్య పరిరక్షణకు 150 ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేశామని ఇందులో ప్రభుత్వ ప్రవేట్ హాస్పిటల్ కు చెందిన సుమారు 900 మంది వైద్యులు నగర ప్రజలకు వైద్య సేవలు అందించారన్నారు. తడి చెత్త పొడి చెత్త పై ప్రజలకు అవగాహన కల్పించేందుకు మెగా సిగ్రిగేషన్ డే నిర్వహించి 80,930 గృహాల నుంచి ఒక గంటలో చెత్తను సేకరించామన్నారు. ఈ కార్యక్రమం పరిశీలించిన వరల్డ్ ల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రతినిధులు సర్టిఫికెట్ అందజేశారన్నారు. ఒంగోలు పురపాలక సంఘం ఏర్పడి 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఈ నెల 30 బుధవారం ఉదయం 9 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు భారీ వేడుకలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో భారత మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు, ఒడిశా గవర్నర్ కంభంపాటి హరిబాబు, ఏపీ రాష్ట్ర స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ముఖ్య అతిథులుగా పాల్గొంటారన్నారు. అదే విధంగా మధ్యాహ్నం మూడున్నర నుంచి సాయంత్రం 5 గంటల వరకు మినీ స్టేడియం నుండి అద్దంకి బస్టాండ్ వరకు 75 జతల ఒంగోలు గిత్తల అందాల పోటీలు




జరుగుతాయన్నారు.ఆయా కార్యక్రమాల్లో తెలుగుదేశం పార్టీ నాయకులు అనుబంధ సంఘాలు నాయకులు, కార్యకర్తలు, పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. వేడుకలలో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలైన పురుషులు తెల్లని షర్టు, పంచె ధరించాలని ఆయన సూచించారు. మహిళా నాయకురాలు వారికి సౌకర్యవంతమైన దుస్తుల్లో రావాలని ఆయన కోరారు. ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ ఒంగోలు ఒంగోలు పురపాలక సంఘం 150 ఏళ్లు పూర్తి చేసుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఎమ్మెల్యే జనార్దన్ రావు నేతృత్వంలో నగర రూపురేఖలు మారిపోయాయన్నారు. విశాలమైన రోడ్లు మురుగునీటి కాలువలు, పార్కుల అభివృద్ధి, అమృత్ 2.0లో ప్రతిరోజు తాగునీటి సరఫరా కు ఎమ్మెల్యే దామచర్ల చర్యలు




చేపట్టారన్నారు. ఒంగోలు ఉత్సవం పేరిట నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో టిడిపి శ్రేణులు పాల్గొని జయప్రదం చేయవలసిందిగా ఆయన కోరారు. సమావేశంలో ఒంగోలు ఏఎంసీ చైర్మన్ రాచగర్ల వెంకట్రావు, మాజీ మేయర్ గంగాడ సుజాత, ఒంగోలు మునిసిపల్ మాజీ చైర్మన్ లు మంత్రి శ్రీనివాసరావు, యక్కల తులసిరావు, ఒంగోలు వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ లు సింగరాజు రాంబాబు, కామేపల్లి శ్రీనివాసరావు, డిప్యూటీ మాజీ మేయర్ వేమూరి సూర్యనారాయణ, సూపర్ బజార్ చైర్మన్ పల్లపోతు వెంకటేశ్వర్లు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ వై వి సుబ్బారావు, టీవీ శ్రీరామ్ మూర్తి, ఎద్దు శశికాంత్ భూషణ్, తాతా ప్రసాద్, టిడిపి నగర ప్రధాన కార్యదర్శి బొడ్డపాటి వెంకట్, మాజీ కార్పొరేటర్లు దాచర్ల వెంకటరమణయ్య, ఆదిపూడి శంకర్ శాండిల్య, చింతపల్లి గోపీచంద్, పి రవితేజ, శ్రీరామ నాగభూషణం, పసుపులేటి శ్రీనివాసరావు, అంగిరేకుల గురవయ్య, అంబటి ప్రసాద్ రావు, మహిళా నాయకురాలు ఆర్ల వెంకటరత్నం, టి అనంతమ్మ , నాళం నరసమ్మ, కే కుసుమకుమారి, పెద్దిశెట్టి వరలక్ష్మి, నిడమానూరు పావని, మందువ లావణ్య, గుంజి విజయలక్ష్మి, ఏ పి టి సి ఏ జిల్లా అధ్యక్షురాలు ఈవీఎస్ లక్ష్మి, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కొమరోలు మండలంలోని పలు పాఠశాలలకు చైర్మన్లుగా వైస్ చైర్మన్ గా ఎంపికైన వారికి సన్మానం అభినందనలు

### చైర్మన్లు వైస్ చైర్మన్ లను సన్మానించి అభినందించిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు

### ముత్తుముల కృష్ణ కిషోర్ రెడ్డి, ముత్తుముల సంజీవరెడ్డి తదితరులు

### పాఠశాలల అభివృద్ధికి, విద్యాభివృద్ధికి కృషి చేస్తూ ప్రభుత్వ ఆశయాన్ని నెరవేర్చాలి



**కొమరోలు పెన్ పవర్ సెప్టెంబర్ 29**

కొమరోలు మండలంలోని పలు పాఠశాలలకు మంగళవారం జరిగిన ఎస్ఎంసి ఎన్నికలలో చైర్మన్లుగా వైస్ చైర్మన్లు గా ఏకగ్రీవంగా ఎన్నికైన వారిని గిద్దలూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులు ముత్తుముల కృష్ణ కిషోర్ రెడ్డి, కొమరోలు సహకార సంఘం చైర్ పర్సన్ ముత్తుముల సంజీవరెడ్డి తదితరులు ఘనంగా సన్మానించి అభినందించారు. కొమరోలు లోని ప్రభుత్వ హైస్కూల్ కు నూతన ఎస్ఎంసి చైర్మన్గా రెండవ పర్యాయం ఎన్నికైన షేక్ మహబూబ్ సుభాని తోపాటు మండలంలోని పలు పాఠశాలలకు చైర్మన్లుగా వైస్ చైర్మన్లుగా ఎన్నికైన వారిని గిద్దలూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులు ముత్తుముల కృష్ణ కిషోర్ రెడ్డి,కొమరోలు సహకార సంఘం చైర్ పర్సన్ ముత్తుముల సంజీవరెడ్డి ప్రత్యేకంగా అభినందించి, పాఠశాలల అభివృద్ధికి విద్యాభివృద్ధికి కృషి చేస్తూ ప్రభుత్వ ఆశయాన్ని నెరవేర్చాలని కోరారు. కొమరోలు లోని ప్రభుత్వ హైస్కూల్ లో మంగళవారం ఆ పాఠశాల మేనేజ్మెంట్ కమిటీ ఎన్నికలు నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన విద్యార్థుల తల్లిదండ్రులు ఆ పాఠశాలకు ఎస్ఎంసి చైర్మన్గా షేక్ మహబూబ్ సుభాని ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గత ఏడాది నిర్వహించిన ఎన్నికలలో కూడా ప్రభుత్వ హైస్కూల్ ఎస్ఎంసి చైర్మన్గా షేక్ మహబూబ్ సుభాని ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రభుత్వ హైస్కూల్ కు రెండవ పర్యాయం ఎస్ఎంసి చైర్మన్గా ఎన్నికైన షేక్ మహబూబ్ సుభాని ని , వైస్ చైర్మన్ గా ఎన్నికైన షేక్ వహీదా బేగంను ముత్తుముల కృష్ణ కిషోర్ రెడ్డి,సంజీవరెడ్డి, మండల తెలుగుదేశం పార్టీ నాయకులు వీరం రెడ్డి శంకర్ రెడ్డి, కొమరోలు మాజీ వార్డ్ మెంబర్ షేక్ సుభాని, కరీముల్లా తో పాటు, పలువురు తెలుగుదేశం పార్టీ నేతలు కార్యకర్తలు అభినందించారు. మంగళవారం కొమరోలు లోని ముత్తుముల సంజీవరెడ్డి నివాస గృహ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అభినందన సభకు ముఖ్య అతిథులుగా పాల్గొన్న కృష్ణ కిషోర్ రెడ్డి సంజీవరెడ్డి తదితరులు మండల పాఠశాలలకు ఎస్ఎంసి చైర్మన్లుగా వైస్ చైర్మన్లుగా ఎన్నికైన వారిని ఆహ్వానించి వారిని శాలువా పూలమాలతో సన్మానించి ఘనంగా సన్మానించి అభినందించారు.

# పేదల సొంతింటి కలకు కూటమి ప్రభుత్వం భరోసా

### లబ్ధిదారులకు పత్రాలు అందజేసిన ఎమ్మెల్యే కందుల

### పట్టణంలో 56 మందికి రూ.1.40 కోట్ల సబ్సిడీ



**మార్కాపురం, పెన్ పవర్సెప్టెంబర్ 29**

పేద, మధ్యతరగతి ప్రజల చిరకాల సొంతింటి కలను కూటమి ప్రభుత్వం నెరవేరుస్తోందని మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని జవహర్ నగర్ టీడీపీ కార్యాలయంలో ఎన్టీఆర్ పట్టణ గృహ నిర్మాణ పథకం కింద మంజూరైన 56 మంది లబ్ధిదారులకు ఆయన మంజూరు పత్రాలను అందజేశారు. హౌసింగ్ శాఖ అధికారులు, పట్టణ టీడీపీ నాయకుల సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్టీఆర్ అర్బన్ హౌసింగ్ స్కీమ్ ద్వారా ఒక్కో లబ్ధిదారునికి రూ.2 లక్షల 50 వేల చొప్పున ప్రభుత్వం సబ్సిడీ అందిస్తుందన్నారు. మార్కాపురం పట్టణంలోనే 56 గృహాలకు గాను మొత్తం రూ.1 కోటి 40 లక్షలను ప్రభుత్వం నేరుగా లబ్ధిదారులకు అందిస్తోందని తెలిపారు. ఇది పేదల పట్ల కూటమి ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. గత ప్రభుత్వం ఇళ్ల పేరుతో పేదలను మోసం చేస్తే, తమ ప్రభుత్వం సొంత స్థలం ఉన్న ప్రతి అర్హునికి ఇల్లు కట్టించే బాధ్యత తీసుకుంటోందని అన్నారు. మార్కాపురం పట్టణంలో సొంత జాగా ఉన్న ప్రతి ఒక్కరికీ విడతల వారీగా ఈ పథకాన్ని వర్తింపజేస్తామని హామీ ఇచ్చారు. అర్హులైన ప్రతి ఒక్కరూ నిరభ్యంతరంగా దరఖాస్తు చేసుకుని ప్రభుత్వ సహాయంతో తమ సొంతింటి కలను నెరవేర్చుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ హౌసింగ్ అధికారులు, టీడీపీ పట్టణ అధ్యక్షులు, వార్డు ఇన్చార్జులు, లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## బాదినేని పల్లె ఎంపీ యూపీ స్కూల్ కమిటీ చైర్మన్గా భువనేశ్వరి,వైస్ చైర్మన్గా ఈశ్వరయ్య ఎన్నిక





**కొమరోలు పెన్ పవర్, సెప్టెంబర్ 29**

కొమరోలు మండలం బాదినేని పల్లె గ్రామంలో గల మండల ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన ఎస్ఎంసి ఎన్నికలలో చైర్మన్ గా వేమిరెడ్డి భువనేశ్వరి, వైస్ చైర్మన్ గా ఎర్రి బోయిన ఈశ్వరయ్య ఏకగ్రీవంగా ఎన్నికైనట్లుగా ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు పులిగోటి సుబ్బరాయుడు ప్రకటించారు. మంగళవారం ఆ పాఠశాలలో ఎస్ఎంసి ఎన్నికలు నిర్వహించారు. ఆ కార్యక్రమానికి ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు పులిగోటి సుబ్బరాయుడు అధ్యక్షత వహించగా,గ్రామ పెద్దలు విద్యార్థులు తల్లిదండ్రులు పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.ఆ సందర్భంగా నిర్వహించిన స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ ఎన్నికలలో పాల్గొన్న సభ్యులు చైర్మన్ గా వేమిరెడ్డి భువనేశ్వరుని, వైస్ చైర్మన్ గా ఎర్రిబోయిన ఈశ్వరయ్యను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఏకగ్రీవంగా ఎన్నికైన భువనేశ్వరి ఈశ్వరయ్యలను ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులతో పాటు ఆ తెలుగుదేశం పార్టీ కో కన్వీనర్ ముత్తుముల ఎల్లారెడ్డి, నేతలు ముత్తుముల వెంకటరెడ్డి వేమిరెడ్డి రాజారెడ్డి,వేమిరెడ్డి వెంకట్రెడ్డి, బద్రి లక్ష్మీ రంగారెడ్డి,ఎర్రిబోయిన మల్లికార్జున తదితరులు పాల్గొని అభినందించారు. ఎస్ఎంసి ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో ముగియటం పట్ల ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు గ్రామ పెద్దలు హర్షం వ్యక్తం చేస్తూ సహకరించిన వారికి ధన్యవాదాలు తెలిపారు.

# పాఠశాల యాజమాన్యం కమిటీ ఎన్నికలు ప్రశాంతం

### 85 పాఠశాలలో ఎన్నికలు ఏకగ్రీవం

### రెండు పాఠశాల ల్లో ఆగిపోయిన ఎన్నిక

**గిద్దలూరు పెన్ పవర్ సెప్టెంబర్ 29**

గిద్దలూరు మండలం లో పాఠశాల యాజమాన్యం ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. మండలంలో 87 పాఠశాలల్లో 85 పాఠశాలల్లో ఎన్నికలు ఏకగ్రీవంగా ఎన్నిక కాగా , జయరాం పురం , పి వెంకటాపురం లో ఎన్నికలు ఆగిపోయాయని ఎమ్ ఏవో 2 నాగభూషన్ రెడ్డి తెలిపారు . మండలం లోని అన్ని పాఠశాలలలో తెలుగుదేశం పార్టీ మద్దతు దారులు ఏకగ్రీవంగా ఎన్నికయారు. ఏకగ్రీవంగా ఎన్నికైనవారందరిని శాసన సభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి తెలుగుదేశం నాయకులు కృష్ణ కిషోర్ రెడ్డిలు అభినందించారు. ఏ పాఠశాలలో కూడా పోటీ చేసేందుకు ఎవరు ముందుకు రాలేదని తెలుస్తుంది. ప్రధాన పాఠశాలలో సైతం పోటీలేకుండానే ఏకగ్రీవం కావటం విశేషం.

# పొదిలి పట్టణాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తా!

## మార్కాపురం ఎమ్మెల్యే నారాయణరెడ్డి



**పొదిలి, పెన్ పవర్, సెప్టెంబర్ 29**

పొదిలి పట్టణాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తానని మార్కాపురం నియోజకవర్గ శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి చెప్పారు. మంగళవారం నాడు ఆయన పొదిలి పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించి, ప్రజా సమస్యల్ని అడిగి తెలుసుకున్నారు. అలాగే పలుచోట్ల నిర్మించనున్న సిమెంట్ రోడ్లకు శంకుస్థాపనలు జరిపారు. అనంతరం



ఎమ్మెల్యే నారాయణరెడ్డి పట్టణంలో మోటర్ సైకిల్లు స్వయంగా నడుపుతూ పార్టీ శ్రేణులను ఉత్తేజపరిచారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత పాలకులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం పొదిలి పట్టణాన్ని పూర్తిగా విస్మరించారని విమర్శలు గుప్పించారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ప్రజల సమస్యలను తీర్చడమే లక్ష్యంగా గట్టి కృషి చేస్తుందని చెప్పారు. గత పాలకులది అరాచకమే తప్ప అభివృద్ధి ఏమాత్రం లేదని ఆయన ఆక్షేపించారు. అభివృద్ధి ధ్యేయంగా తమ ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తుందని ఎమ్మెల్యే కందుల స్పష్టం చేశారు. మార్కాపురం ను ప్రత్యేక జిల్లాగా ప్రకటించామని, వెలుగొండ ప్రాజెక్టును సాధించుకోవడం కూడా జరిగిందని కందుల చెప్పారు. హార్టికల్చర్ హబ్ తో పొదిలి మండల ప్రజలు ఎంతో లబ్ధి పొందగలరని ఆయన స్పష్టం చేశారు. అమృత్ 2 పథకం ద్వారా 165 కోట్ల రూపాయల వ్యయంతో పొదిలి పట్టణానికి ఇంటింటికి నీటి కొళాయి ఏర్పాటు చేసే పనులు త్వరలో ప్రారంభమవుతాయని ఆయన చెప్పారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి పనులను చూసి ఓర్వలేక, వైసిపి నాయకులు పసలేని నిందారోపణలు చేస్తున్నారని ఎమ్మెల్యే కందుల కొట్టి పారేశారు. అనంతరం అనారోగ్యంతో మరణించిన సీనియర్ రిపోర్టర్ పింగళి భానుచందర్ మృతదేహాన్ని సందర్శించి ఆయన ఘనంగా నివాళులు అర్పించి, కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే నారాయణరెడ్డి వెంట మండల తెలుగుదేశం పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మేదరమెట్ల ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రంలో అధికారుల అధ్యయన పర్యటన

### గ్రామ పంచాయతీల్లో వర్మీ కంపోస్ట్ ఉత్పత్తిని వేగవంతం చేయాలి



**అద్దంకి, ఆర్.సి(పెన్ పవర్) సెప్టెంబర్ 29:**

గ్రామాల్లో ఘన వ్యర్థాల సమర్థవంతమైన నిర్వహణ, వర్మీ కంపోస్ట్ ఎరువుల ఉత్పత్తిని పెంచడమే లక్ష్యంగా కొరిశపాడు మండలం, మేదరమెట్ల గ్రామ పంచాయతీ పరిధిలోని 'చెత్త నుండి సంపద తయారీ కేంద్రం నందు మంగళవారం ఒకరోజు అధ్యయన పర్యటన (ఎక్స్‌పోజర్ విజిట్), శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.?ముఖ్యంగా వర్మీ కంపోస్ట్ ఉత్పత్తిలో వెనుకబడిన గ్రామ పంచాయతీల్లో ప్రగతిని పెంచేందుకు ఈ శిక్షణలో అధికారులు, సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. రాబోయే అక్టోబర్ నెలలో ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో కనీసం 1,000 కిలోల వర్మీ కంపోస్ట్‌ను ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు. ఇందుకోసం చేపట్టాల్సిన ముందస్తు కార్యాచరణ, వర్మీ కంపోస్ట్ తయారీ విధానం, ముడి పదార్థాల ఎంపిక, షెడ్ల నిర్వహణ, ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచే పద్ధతులపై క్షేత్రస్థాయిలో ప్రత్యక్షంగా అవగాహన కల్పించారు. మేదరమెట్ల ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రంలో అమలవుతున్న తడి-పొడి చెత్త విభజన, ఘన వ్యర్థాల ప్రాసెసింగ్, ఉత్తమ నిర్వహణ పద్ధతులను ఇతర మండలాల అధికారులు, సిబ్బంది పరిశీలించారు.

**గ్రీన్ అంబాసిడర్లకు వైద్య పరీక్షలు..**

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడంలో కీలకపాత్ర పోషిస్తున్న గ్రీన్ అంబాసిడర్ల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని, వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో శిక్షణా ప్రాంగణంలోనే ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. సిబ్బందికి పలు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులతో పాటు ఆరోగ్య పరిరక్షణకు సంబంధించిన జాగ్రత్తలను వైద్యులు సూచించారు. గ్రామస్థాయిలో ఘన వ్యర్థాల సమర్థవంతమైన రీసైక్లింగ్ ద్వారా స్వచ్ఛమైన, పరిశుభ్రమైన గ్రామాల నిర్మాణానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని అధికారులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కొరిశపాడు ఎంపీడీవో హనుమంతరావు, అద్దంకి ఎంపీడీవో మస్తాన్ శ్రీధర్, డీఆర్‌పీ చక్రధర్, నాగులుప్పలపాడు, దొనకొండ, తాళ్లూరు మండలాలకు చెందిన ఎంపీడీవోలు, డిప్యూటీ ఎంపీడీవోలు, మేదరమెట్ల పంచాయతీ డెవలప్‌మెంట్ అధికారి లక్ష్మీకాంత్, వివిధ పంచాయతీల పీడీవోలు, గ్రీన్ అంబాసిడర్లు పాల్గొన్నారు.

# పల్లె పండుగ 3.0తో గ్రామాల సమగ్ర ప్రగతి

### కొరిశపాడు మండలంలో రూ. 4.07 కోట్లతో 12 అభివృద్ధి పనులు

### మంత్రి గొట్టిపాటి చొరవతో మంజూరైన నిధులు





**అద్దంకి, ఆర్.సి(పెన్ పవర్) సెప్టెంబర్ 29:**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'పల్లె పండుగ 3.0' కార్యక్రమంలో భాగంగా గ్రామీణ ప్రాంతాల సమగ్రాభివృద్ధే ధ్యేయంగా పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి. రవికుమార్ ప్రత్యేక చొరవతో కొరిశపాడు మండలంలోని 10 గ్రామాలకు సంబంధించి మొత్తం రూ. 4 కోట్ల 7 లక్షల 30 వేల వ్యయంతో 12 అభివృద్ధి పనులు మంజూరయ్యాయి. ఈ పనులకు మంగళవారం ఆయా గ్రామాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు శాస్త్రోక్తంగా భూమిపూజ నిర్వహించారు. ?మండల పరిధిలోని దైవాలరావూరు, బొడ్డువానిపాలెం, పి.గుడిపాడు, రావినూతల, పమిడిపాడు గ్రామాలలో ఎంపీడీవో హనుమంతరావు, మండల పంచాయతీరాజ్ అసిస్టెంట్ ఇంజినీర్ ప్రసాదరావు, ఏపీవో గాయత్రిదేవి కలిసి నూతన పనులకు శంకుస్థాపన చేశారు. ?ఈ సందర్భంగా ఎంపీడీవో హనుమంతరావు మాట్లాడుతూ.. మంత్రి గొట్టిపాటి రవికుమార్ కృషితో కొరిశపాడు మండలంలోని గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం భారీగా నిధులు కేటాయించిందన్నారు. పల్లె పండుగ 3.0 కింద మంజూరైన పనులను నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ, యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని స్పష్టం చేశారు. గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ?ఈ శంకుస్థాపన కార్యక్రమాల్లో ఆయా గ్రామాల తెలుగుదేశం పార్టీ నాయకులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గ్రామీణాభివృద్దే లక్ష్యంగా పల్లె పండుగ కార్యక్రమం

### కూటమి ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి -పాశం రామకృష్ణ



**సి ఎస్ పురం, పెన్ పవర్ సెప్టెంబర్ 29**

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి లక్ష్యంగా వరికుంటపాడు మండలం రామాపురం గ్రామంలో మంగళవారం నిర్వహించిన పల్లె పండుగ 3.0 కార్యక్రమానికి మండలం నుంచి బిజెపి నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలివెళ్లారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ పిలుపు మేరకు, బిజెపి జిల్లా అధ్యక్షులు పీవీ కృష్ణారావు, కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆదేశాలతో మండల బిజెపి అధ్యక్షులు పాశం రామకృష్ణ ఆధ్వర్యంలో మండలంలోని వివిధ గ్రామాల నుంచి బిజెపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో ప్రత్యేక వాహనాల్లో రామాపురం తరలివెళ్లడంతో పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. పల్లె పండుగ కార్యక్రమంలో పాల్గొని గ్రామీణాభివృద్ధికి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు మద్దతు తెలిపారు.ఈ సందర్భంగా పాశం రామకృష్ణ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తూ పల్లె పండుగ వంటి కార్యక్రమాలను నిర్వహించి ప్రారంభించడం అభినందనీయమన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు, మౌలిక వసతులు, ప్రజలకు అవసరమైన సౌకర్యాల కల్పనకు ఎన్డిఏ కూటమి ప్రభుత్వం చేపట్టిందన్నారు పల్లెల అభివృద్ధితోనే రాష్ట్రం, దేశం మరింత ముందుకు సాగుతుందన్నారు దేశవ్యాప్తంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో ప్రజా సంక్షేమం, మౌలిక వసతుల అభివృద్ధికి అనేక కార్యక్రమాలు అమలు అవుతున్నాయని తెలిపారు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు అభివృద్ధి కార్యక్రమాల ద్వారా ప్రజలకు ప్రయోజనం చేకూరుతుందన్నారు రాష్ట్రంలో గ్రామీణాభివృద్ధికి ప్రాధాన్యమిస్తూ పల్లె పండుగ 3.0 కార్యక్రమాన్ని సమన్వయంతో ప్రారంభించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కు, ఉపముఖ్యమంత్రి కొణిదల పవన్ కల్యాణ్ కు, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పివియన్ మాధవ్ కు కృతజ్ఞతలు తెలిపారు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో గ్రామాల్లో అభివృద్ధి మరింత వేగవంతం కావాలని ఆకాంక్షించారు పల్లె పండుగ కార్యక్రమానికి తరలివచ్చిన బిజెపి నాయకులకు కార్యకర్తలకు అభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి మాదినేని లక్ష్మణ్, జిల్లా బిజెపి కార్యవర్గ సభ్యులు ఇండ్ల వెంకట సత్యం, మండ బిజెపి ప్రధాన కార్యదర్శి ఇండ్ల దుర్గాప్రసాద్, ఎస్సీ సెల్ అధ్యక్షులు పెనుమాల చెన్నయ్య, పులిమి రమణయ్య, పెద్దిరెడ్డి రమణారెడ్డి, బిజెపి నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

# ఎస్ఎంసి కమిటీ చైర్మన్‌కు సన్మానం

### పాఠశాల అభివృద్ధికి అఫ్రోజ్ సేవలు అభినందనీయం

### హెచ్ఎం జె భారతి



**సి.ఎస్.పురం,పెన్ పవర్ సెప్టెంబర్ 29**

మండలంలోని ఆనికాలపల్లి ప్రాథమిక పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ గా ఎన్నికై గత రెండేళ్లుగా సేవలందించిన షేక్ అఫ్రోజ్ పదవీకాలం ముగిసిన సందర్భంగా మంగళవారం పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు జె భారతి అధ్యక్షతన వీడ్కోలు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు జె. భారతి మాట్లాడుతూ విద్యా కమిటీ చైర్మన్ గా షేక్ అఫ్రోజ్ గత రెండేళ్లుగా పాఠశాల అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు అందించారని అన్నారు. పాఠశాల అభివృద్ధి కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనడం అభినందనీయమన్నారు. ఈ విధంగా పాఠశాలకు చైర్మన్ సహాయ సహకారాలు అందించాలని కోరారు. షేక్ అఫ్రోజ్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో విద్యా కమిటీ చైర్మన్ గా అవకాశం కల్పించిన విద్యార్థుల తల్లిదండ్రులకు, పాఠశాల ఉపాధ్యాయులు, కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. రెండేళ్ల పదవీకాలంలో పాఠశాల అభివృద్ధికి తనవంతు సహకారం అందించడం సంతృప్తినిచ్చిందన్నారు. భవిష్యత్తులోనూ పాఠశాల అభివృద్ధికి అవసరమైన సహకారం అందిస్తానని తెలిపారు. పాఠశాలకు చేసిన శ్రమకృషి ఫలితంగా సన్మానించినందుకు ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలియజేస్తూ తనకు ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు అనంతరం షేక్ అఫ్రోజ్ ను శాలువా తో ఘనంగా సన్మానించి జ్ఞాపిక అందజేశారు. ఈ సన్మాన కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జె భారతి, అంగన్వాడి కార్యకర్త షేక్ షహనాజ్, ఆయా విజయలక్ష్మి గ్రామస్తులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# మండలంలో 48 పాఠశాలల్లో ఎస్ఎంసీ ఎన్నికలు పూర్తి

### కోరం లేక 3 చోట్ల వాయిదా





**పెన్ పవర్, తర్లపాడు, సెప్టెంబర్ 29**

మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పాఠశాల నిర్వహణ కమిటీ (ఎస్ఎంసీ) ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. మండల పరిధిలో మొత్తం 51 పాఠశాలలు ఉండగా 48 పాఠశాలల్లో చైర్మన్, వైస్ చైర్మన్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కోరం లేకపోవడంతో 3 పాఠశాలల్లో ఎన్నికలు వాయిదా పడ్డాయి. మండలంలో 39 ప్రాథమిక, ఒక ప్రాథమికోన్నత, 8 ఉన్నత పాఠశాలలు, ఒక హైస్కూల్ ప్లస్, ఒక ఎయిడెడ్, ఒక కేజీబీవీ, రెండు ఉర్దూ పాఠశాలలు ఉన్నాయి. ఎంపీపీ పాఠశాల మంగళకుంట, జెడ్పీహెచ్ఎస్ తుమ్మలచెరువు, జెడ్పీహెచ్ఎస్ గానుగపెంట పాఠశాలల్లో కోరం లేక వాయిదా పడ్డాయని, కోరం ఏర్పడిన తర్వాత ఎన్నికలు నిర్వహిస్తామని విద్యాశాఖ అధికారులు తెలిపారు.

**తర్లపాడులో ఏకగ్రీవం**

మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్‌గా పఠాన్ ఫిరోజ్ ఖాన్, వైస్ చైర్మన్‌గా చెంచునేడి మాధవి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తర్లపాడు హిందూ పాఠశాల చైర్మన్‌గా గోసు నరసింహ, ఉర్దూ పాఠశాల చైర్మన్‌గా షేక్ వనం కరీముల్లా ఎన్నికయ్యారు.నూతనంగా ఎన్నికైన చైర్మన్లు, వైస్ చైర్మన్లు, కమిటీ సభ్యులను గ్రామ పెద్దలు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. పాఠశాలల అభివృద్ధికి, విద్యార్థులకు మెరుగైన వసతుల కల్పనకు కృషి చేయాలని ఆకాంక్షించారు.

# రైతుల సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

### కోనంగి వెంకట కొండయ్య

**సి.ఎస్.పురం, పెన్ పవర్ సెప్టెంబర్ 29**

మండలంలోని బాలుపల్లి, వెంకటాయచెరువు, కొట్టాలు గ్రామాల పరిధిలో రైతులు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యకు పరిష్కారం లభించింది. కనిగిరి ఎమ్మెల్యే, ఒంగోలు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం ఆర్డీఎస్ త్రీఫేజ్ విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ ను జిల్లా గొర్రెల పెంపకందారుల సహకార యూనియన్ డైరెక్టర్ కోనంగి వెంకటకొండయ్య ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి చొరవతో రైతులకు సాగునీటి కోసం విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా త్రీఫేస్ ట్రాన్స్ఫారం ఏర్పాటు చేసినట్లు తెలిపారు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సారథ్యంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం రైతుల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. రైతులకు విద్యుత్ అంతరాయం లేకుండా సాగు సజావుగా సాగేందుకు మూడు గ్రామాల రైతుల విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకుని త్రీఫేజ్ ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటు చేయడంతో విద్యుత్ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించిందన్నారు రైతులు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకుని పంటల సాగును మరింత మెరుగుపరుచుకోవాలని సూచించారు.ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటుతో తమ గ్రామాల్లో విద్యుత్ సమస్య పరిష్కారమవుతుందని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. రైతుల సమస్యను పరిష్కరించేందుకు చొరవ చూపిన టిడిపి నాయకులకు విద్యుత్ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో గొర్ల అల్లూరయ్య, మన్నుల వెంకటరమణయ్య, కొల్లెబోయిన రామకృష్ణ, కామనబోయిన కొండయ్య, బొమ్మన బోయిన రమణయ్య, లక్కిపోగు గురవయ్య, మహేంద్ర రమణయ్య జనార్ధన్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.



# పల్లె పండుగకు పెద్దరాజుపాలెం నుంచి భారీ తరలింపు

### పొదుపు గ్రూపు సభ్యులను అభినందించిన అల్లూరి



**సి ఎస్ పురం, పెన్ పవర్ సెప్టెంబర్ 29**

రాష్ట్ర గ్రామీణ అభివృద్ధి లో భాగంగా మంగళవారం నిర్వహించిన పల్లె పండుగ 3.0 కార్యక్రమ ప్రారంభోత్సవానికి మండలంలోని పెద్దరాజుపాలెం గ్రామం నుంచి కనిగిరి ఎమ్మెల్యే, ఒంగోలు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆదేశాల మేరకు టీడీపీ సీనియర్ నాయకులు అట్లూరి రామకృష్ణరాజు ఆధ్వర్యంలో మూడు ప్రత్యేక బస్సుల్లో సుమారు 180 మంది పొదుపు సంఘాల గ్రూపు సభ్యులు, వి.బి.జి.-రామ్ కూలీలు, రైతులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొని గ్రామీణాభివృద్ధికి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు మద్దతు తెలిపారు.ఈ సందర్భంగా అట్లూరి రామకృష్ణరాజు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి పల్లె పండుగ 3.0 కార్యక్రమం ఎంతో ఉపయోగకరమన్నారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన, రహదారులు, ప్రజలకు అవసరమైన సౌకర్యాల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకోవడం అభినందనీయమన్నారు. గ్రామాల అభివృద్ధి కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల్లో ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. పెద్దరాజుపాలెం నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు రామాపురం తరలివెళ్లడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సహకరించిన పొదుపు సంఘాల సభ్యులకు, తెలుగుదేశం పార్టీ నాయకులకు, వి బి జి రామ్ కూలీలకు, రేషన్ షాపు డీలర్లకు కృతజ్ఞతలు తెలిపారు.

# కొత్తపట్నం మండలంలో 475 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు

## - ఎంపీ మాగుంట.. ఎమ్మెల్యే దామచర్ల వెల్లడి - కొత్త పట్నం లో పల్లె పండుగ 3.ఓ కార్యక్రమం

**ఒంగోలు కల్చరల్, పెన్ పవర్ సెప్టెంబర్ 29**

రెండున్నర ఏళ్ల కూటమి ప్రభుత్వ పాలనలో కొత్తపట్నం మండలంలో 475 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని స్థానిక ఒంగోలు లోక్ సభ సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి, ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్దన్ రావు లు పేర్కొన్నారు. కొత్తపట్నం మండలం మదనూరు స్వర్ణాంధ్ర పట్టపాలెం గ్రామంలో నిర్వహించిన పల్లె పండుగ 3. ఓ కార్యక్రమంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వి బీ జి రామ్జి పథకం క్రింద రూ5 కోట్ల 30 లక్షల రూపాయల నిధులతో సిమెంట్ రోడ్లు నిర్మాణం చేసేందుకు భూమి పూజ కార్యక్రమం నిర్వహిచడం జరిగిందన్నారు. మొదటి దశలో ఏడున్నర కోట్ల రూపాయలు పెట్టి అభివృద్ధి చేశామని, రెండవ దశలో 9 కోట్లు పైన నిధులు వెచ్చించి కొన్ని గ్రామాలను అభివృద్ధి చేశామని, 3.ఓ కార్యక్రమంలో భాగంగా ఈ మండలానికి 11 కోట్ల 85 లక్షల రూపాయల నిధులను వెచ్చించి సిమెంట్ రోడ్లు నిర్మాణానికి మూడు నెలల్లో పూర్తి చేసేందుకు ప్రణాళిక రూపొందించామని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి కే. పవన్ కళ్యాణ్ ఇరువురు కలిసి నెల్లూరు జిల్లాలో ఈ కార్యక్రమాల లాంఛనంగా ప్రారంభించారని,ఒంగోలు నియోజక వర్గంలో మన గ్రామంలో ఈ





కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగిందని తెలిపారు. స్వర్ణాంధ్ర పట్టింపు పాలెం గ్రామంలో మంచినీటి సమస్యను అక్టోబర్ 5వ తేదీ లోపల పనులకు పూర్తి చేసి ప్రజలకు నీరు అందిస్తామని అన్నారు. ఈ మండలంలో అన్ని కార్యక్రమాలను పూర్తి చేయడం జరిగిందని పంచాయతీ భవనాలు బస్ షెల్టర్లు ఇతర ఇతర బిల్డింగులు డిసెంబర్లో వచ్చే నిధులతో పనులు చేపడతామని తెలిపారు. ఫిషింగ్ హార్బర్ త్వరలోనే శంఖుస్థాపన చేయబోతున్నామని అన్నారు. ఈ మండలంలో మదనూరు నుంచి ఒంగోలు వెళ్లే మార్గంలో ఉన్న బకింగ్ హాం కెనాల్ బ్రిడ్జి కూడా తొందరలో పూర్తి చేస్తామని అన్నారు. ఈ మండలానికి ఇప్పుడు 16 కోట్ల 50 లక్షల రూపాయలు నిధులు అందించడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డ్వామా పిడి వెంకటేశ్వరరావు, కొత్తపట్నం మండల టిడిపి అధ్యక్షులు శ్రీనివాసులు రెడ్డి, టిడిపి సీనియర్ నాయకులు గేనం సుబ్బారావు, రామచంద్ర గౌడ్, మేకల జకరయ్య, రమేష్, దేవదాసు, చంద్రశేఖర్, కోలా ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

# కొమరోలు ప్రభుత్వ హైస్కూల్ ఎస్ఎంసి చైర్మన్‌గా మహబూబ్ సుభాని ఎన్నిక

వైస్ చైర్మన్ గా షేక్ వహీదా బేగం.

ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించిన పాఠశాల ప్రధానోపాధ్యాయులు శివనాగేశ్వరరావు.





**కొమరోలు పెన్ పవర్ సెప్టెంబర్ 29**

కొమరోలు లోని ప్రభుత్వ హైస్కూలు ఎస్ఎంసి చైర్మన్ గా షేక్ మహబూబ్ సుభాని రెండవ పర్యాయం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు శివనాగేశ్వరరావు తెలిపారు. కొమరోలు లోని ప్రభుత్వ హైస్కూల్ లో మంగళవారం స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ ఎన్నికలు నిర్వహించారు ఆ కార్యక్రమానికి విద్యార్థుల తల్లిదండ్రులు, ఆ పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. ఆ సందర్భంగా నిర్వహించిన ఎస్ఎంసి ఎన్నికలలో షేక్ మహబూబ్ సుభాని రెండవ పర్యాయం చైర్మన్ గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వైస్ చైర్మన్ గా షేక్ వహీదా బేగం ఎన్నికయ్యారని ప్రధానోపాధ్యాయులు శివనాగేశ్వరరావు తెలిపారు. ఎస్ఎంసి ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో ముగిశాయని అంటూ ఎన్నికలు, ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించుటకు సహకరించిన విద్యార్థుల తల్లిదండ్రులకు గ్రామ పెద్దలకు పాఠశాల ఉపాధ్యాయులకు ప్రధానోపాధ్యాయులు శివనాగేశ్వరరావు ధన్యవాదాలు తెలిపారు. కొమరోలు లోని ప్రభుత్వ హైస్కూల్ కు ఎస్ఎంసి చైర్మన్ గా గత ఏడాది ఏకగ్రీవంగా ఎన్నికయ్యాలని ఏడాది కూడా మళ్లీ తానే చైర్మన్ గా ఎన్నిక కావడం చాలా సంతోషంగా ఉన్నదని పాఠశాల అభివృద్ధికి విద్యార్థుల విద్యాభివృద్ధికి , పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పనకు తన వంతుగా కృషి చేస్తానని ఎస్ఎంసి చైర్మన్ షేక్ మహబూబ్ సుభాని తెలిపారు. నూతన ఎస్ఎంసి చైర్మన్ మహబూబ్ సుభాని వైస్ చైర్మన్ షేక్ వహీదాలను పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు శాలువా పూలమాలతో ఘనంగా సన్మానించి అభినందించారు.

# పల్లె పండుగకు పోటెత్తిన జనం

రామాపురం బాట పట్టిన మండల ప్రజలు

విజయవంతం చేసిన ప్రజలకు కృతజ్ఞతలు

తెలిపిన బొబ్బూరి రమేష్






**సి ఎస్ పురం, పెన్ పవర్ సెప్టెంబర్ 29**

పల్లె పండుగ కార్యక్రమానికి మండలం నుండి వేలాదిమంది ప్రజలు పాల్గొని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి మండల టిడిపి అధ్యక్షులు బొబ్బూరి రమేష్ కృతజ్ఞతలు తెలిపారు వరికుంటపాడు మండలం రామాపురం గ్రామంలో నిర్వహించిన పల్లె పండుగ 3.0 కార్యక్రమానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి కొణిదల పవన్ కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ హాజరవుతున్న నేపథ్యంలో సీ.ఎస్.పురం మండలం నుంచి టిడిపి నాయకులు మరియు కోవిలంపాడు గ్రామ టిడిపి అధ్యక్షులు అమడసాని బాలకేశవరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం భారీ సంఖ్యలో ప్రజలు తరలివెళ్లారు. కనిగిరి ఎమ్మెల్యే, ఒంగోలు పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆదేశాల మేరకు మండల టిడిపి అధ్యక్షులు బొబ్బూరి రమేష్ పర్యవేక్షణలో ప్రత్యేక బస్సులలో మండలంలోని వివిధ గ్రామాల నుంచి మహిళలు, యువత, రైతులు, టీడీపీ, జనసేన శ్రేణులు, అభిమానులు పెద్ద సంఖ్యలో బస్సుల్లో రామాపురం బయలుదేరారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మరియు జనసేన అధినేత, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ను ప్రత్యక్షంగా చూసేందుకు అభిమానులు, కార్యకర్తలు తండోపతండాలుగా తరలి వెళ్లారు పల్లె పండుగ 3.0 కార్యక్రమంతో గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పనులను ప్రారంభించడంతో పలువురు అభినందించారు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పర్యటనను ప్రత్యక్షంగా వీక్షించేందుకు అవకాశం రావడం ఆనందంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని మండలం నుండి వేలాదిమంది ప్రజలు పాల్గొని విజయవంతం చేశారు.

# అల్లినగరంలోని జిల్లా పరిషత్ హై స్కూల్ కు ఎస్ఎంసి చైర్మన్‌గా కొవ్వూరి సుబ్బరాయుడు ఎన్నిక

వైస్ చైర్మన్ గా కాకర్ల పీరాంబి ఎన్నిక

ఎన్నికలను ప్రశాంత వాతావరణం లో నిర్వహించిన పాఠశాల ప్రధానోపాధ్యాయులు మామిడి పద్మజ





**కొమరోలు పెన్ పవర్ సెప్టెంబర్ 29**

కొమరోలు మండలం అల్లినగరంలోని మునగనూరి వెంకటసుబ్బ య్య అండ్ సన్స్ జిల్లా పరిషత్ హై స్కూల్ కు స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ (ఎస్ఎంసి,) చైర్మన్ గా కొవ్వూరి సుబ్బరాయుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు మామిడి పద్మజ తెలిపారు. ఆ పాఠశాల లోఎస్ఎంసి ఎన్నికలు మంగళవారం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మామిడి పద్మజ అధ్యక్షతన జరిగాయి. ఆ కార్యక్రమానికి విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు, ఆ పాఠశాల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.ఆ సందర్భంగా నిర్వహించిన ఎన్నికలలో ఎస్ఎంసి చైర్మన్ గా కొవ్వూరి సుబ్బరాయుడు, వైస్ చైర్మన్ గా కాకర్ల ఖాసిం వలి భార్య పీరాంబి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని ప్రధానోపాధ్యాయురాలు మామిడి పద్మజ తెలిపారు. ఎస్ఎంసి చైర్మన్ గా ఎన్నికైన సుబ్బరాయుడు, వైస్ చైర్మన్ గా ఎన్నికైన పీరాంబిలను అభినందిస్తూ, వారు పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల విద్యాభివృద్ధికి, పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పనకు సహకారం అందించాలని ఆమె ఆకాంక్షించారు. .ఎస్ఎంసి ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించుటకు సహకరించిన విద్యార్థుల తల్లిదండ్రులకు,గ్రామ పెద్దలకు,పాఠశాల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులకు మామిడి పద్మజ ధన్యవాదాలు తెలిపారు. ఆ కార్యక్రమంలో ఆ పాఠశాల ఉపాధ్యాయులు జనార్ధన్ రాజు చంద్రమోహన్ శివరాం హరి కుమార చౌదరి శ్రీనివాసులు కృష్ణమూర్తి ఆదిలక్ష్మి షాలిని,బోధనేతర సిబ్బంది ఫకీరయ్య అశ్వినీ దేవి విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# చైర్మన్ ఎన్నికలో ప్రధానోపాధ్యాయుడి అత్యుత్సాహం..!

తల్లిదండ్రులకు ఓ వ్యక్తికి చేతులెత్తాలని సూచించారంటూ ఆరోపణ

అసంతృప్తితో పిల్లల టీసీ తీసుకెళ్లిన తండ్రి

**పుల్లల చెరువు పెన్ పవర్ సెప్టెంబర్ 29**

పుల్లలచెరువు మండల కేంద్రంలోని బీసీ కాలనీలో ఉన్న మెయిన్ స్కూల్‌లో నిర్వహించిన పేరెంట్స్ కమిటీ చైర్మన్ ఎన్నిక వివాదానికి దారితీసింది.చైర్మన్ ఎన్నిక సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అత్యుత్సాహం ప్రదర్శించారని అదే పాఠశాలలో తమ పిల్లలను చదివిస్తున్న నీలబోయిన యోగేశ్వరావు ఆరోపించారు. ఎన్నికల సమయంలో ప్రధానోపాధ్యాయుడు ఒక వ్యక్తికి అనుకూలంగా వ్యవహరించారని, తల్లిదండ్రులను ప్రభావితం చేసేలా బహిరంగంగా సూచనలు చేశారని ఆయన ఆరోపించారు.పేరెంట్స్ కమిటీ చైర్మన్ ఎన్నిక ప్రక్రియ జరుగుతున్న సమయంలో ప్రధానోపాధ్యాయుడు ఒక వ్యక్తికి మద్దతుగా వ్యవహరించడంతో అక్కడి తల్లిదండ్రుల్లో అసంతృప్తి వ్యక్తమైనట్లు యోగేశ్వరావు తెలిపారు.అధికార పార్టీకి మద్దతు ఉన్న వ్యక్తికి అనుకూలంగా ప్రధానోపాధ్యాయుడు వ్యవహరించారని, తల్లిదండ్రులను ఉద్దేశించి సదరు వ్యక్తికి చేతులెత్తాలని బహిరంగంగా చెప్పారని ఆయన ఆరోపించారు. పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రుల సమక్షంలో ఇటువంటి పరిస్థితి ఏర్పడటం చర్చనీయాంశంగా మారిందన్నారు.విద్యార్థుల తల్లిదండ్రుల కమిటీ ఎన్నికలు పాఠశాల అభివృద్ధి, విద్యార్థుల సంక్షేమం కోసం నిర్వహించాల్సి ఉండగా, వాటిలో ఉపాధ్యాయులు రాజకీయ పరంగా జోక్యం చేసుకోవడం సరికాదని యోగేశ్వరావు పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియ నిష్పక్షపాతంగా సాగాల్సిన సమయంలో ఒక వ్యక్తికి అనుకూలంగా వ్యవహరించారని ఆరోపిస్తూ ఆయన అభ్యంతరం వ్యక్తం



చేశారు.ఈ పరిణామంతో అసహనానికి గురైన యోగేశ్వరావు తన పిల్లలు ఆ పాఠశాలలో చదవడం కొనసాగించడం ఇష్టం లేక, వారి విద్యా సంబంధిత టీసీ తీసుకుని వెళ్లినట్లు తెలిపారు.పాఠశాలలో చోటుచేసుకున్న పరిణామాలపై సంబంధిత విద్యాశాఖ అధికారులు స్పందించి, ఎన్నికల సమయంలో ఏం జరిగిందనే విషయంపై విచారణ చేపట్టి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని ఆయన కోరారు.అయితే ప్రధానోపాధ్యాయుడిపై వచ్చిన ఆరోపణలపై ఆయన వైపు నుంచి అధికారిక వివరణ వెలువడాల్సి ఉంది.విద్యార్థుల తల్లిదండ్రుల కమిటీ ఎన్నికను వాయిదా వేసి మళ్ళీ నిర్వహించాలని యోగేశ్వరరావు కోరారు.

# ఎం.ఎస్.ఎం.ఈ పార్కును సందర్శించిన జాయింట్ కలెక్టర్



**ఒంగోలు కలెక్టరేట్, పెన్ పవర్ సెప్టెంబర్ 29**

జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి మంగళవారం ఒంగోలు నియోజకవర్గంలోని దశరాజు పల్లి గ్రామంలో ఏర్పాటు చేస్తున్న మైక్రో, స్మాల్, మీడియం ఎంటర్ప్రైజెస్ ( ఎం.ఎస్.ఎం.ఈ ) పార్కును సందర్శించారు. ఇందులో కల్పిస్తున్న మౌలిక సదుపాయాల పురోగతిని తనిఖీ చేశారు. ఈ పార్కులో అవసరమైన డ్రైనేజీలు, కల్వర్టుల నిర్మాణం పూర్తయినట్లు అధికారులు వివరించారు. రోడ్ల నిర్మాణం కూడా దాదాపు పూర్తయిందని, తారు వేయాల్సి ఉందని చెప్పారు. విద్యుత్ సదుపాయాలను కూడా పూర్తి చేయాల్సి ఉన్నట్లు తెలిపారు. దీనిపై ఆమె స్పందిస్తూ త్వరగా వీటిని అందుబాటులోకి తెచ్చేలా సంబంధిత శాఖలు సమన్వయంతో పని చేయాలని అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ వెంట ఆర్డీవో చంద్రశేఖర్ నాయుడు, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ మదన్, ఇతర అధికారులు ఉన్నారు.

# కొమరోలు ప్రభుత్వ హైస్కూలు కు ఎస్ఎంసి చైర్మన్గా రెండవ పర్యాయం ఎన్నికైన మహబూబ్ సుభానిని అభినందించిన ముత్తుముల సంజీవరెడ్డి తదితరులు





**కొమరోలు పెన్ పవర్ సెప్టెంబర్ 29**

కొమరోలు లోని ప్రభుత్వ హైస్కూల్ కు నూతన ఎస్ఎంసి చైర్మన్గా రెండవ పర్యాయం ఎన్నికైన షేక్ మహబూబ్ సుభాని ని కొమరోలు సహకార సంఘం చైర్ పర్సన్ ముత్తుముల సంజీవరెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. కొమరోలు లోని ప్రభుత్వ హైస్కూల్ లో మంగళవారం ఆ పాఠశాల మేనేజ్మెంట్ కమిటీ ఎన్నికలు నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన విద్యార్థుల తల్లిదండ్రులు ఆ పాఠశాలకు ఎస్ఎంసి చైర్మన్గా షేక్ మహబూబ్ సుభాని ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గత ఏడాది నిర్వహించిన ఎన్నికలలో కూడా ప్రభుత్వ హైస్కూల్ ఎస్ఎంసి చైర్మన్గా షేక్ మహబూబ్ సుభాని ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రభుత్వ హైస్కూల్ కు రెండవ పర్యాయం ఎస్ఎంసి చైర్మన్గా ఎన్నికైన షేక్ మహబూబ్ సుభాని ని , వైస్ చైర్మన్ గా ఎన్నికైన షేక్ వహీదా బేగంను ముత్తుముల సంజీవరెడ్డి, మండల తెలుగుదేశం పార్టీ నాయకులు వీరం రెడ్డి శంకర్ రెడ్డి తో పాటు, పలువురు తెలుగుదేశం పార్టీ నేతలు కార్యకర్తలు అభినందించారు.

# సంజీవరావుపేట జెడ్పీహెచ్ఎస్‌లో ఏకగ్రీవంగా ఎస్ఎంసీ ఎన్నిక

**గిద్దలూరు:పెన్ పవర్ సెప్టెంబర్ 29**

గిద్దలూరు మండలంలోని జెడ్పీహెచ్ఎస్ సంజీవరావుపేట పాఠశాలలో ఎస్ఎంసీ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. ఎస్ఎంసీ చైర్మన్‌గా పేళ్లూరి శ్రీనివాసులు, వైస్ చైర్మన్‌గా కె. స్వర్ణకుమారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం వి.వి. నాగరాజు, పాఠశాల ఉపాధ్యాయులు, పీఈటీ ధనలక్ష్మి, సీఆర్ఎంటీ ఖాదర్‌వలి తదితరులు పాల్గొన్నారు. నూతనంగా ఎన్నికైన చైర్మన్, వైస్ చైర్మన్‌కు పాఠశాల సిబ్బంది అభినందనలు తెలిపారు.



On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, Published at D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Printed by GANTYADA APPARAO, Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS, D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Editor: G.APPARAO, (Responsible for selection of news under the PRB Act ) RNI : APTEL/2014/58046 e-mail:penpower9@gmail.com